సమాచార హక్కు

# సమాచార హక్కు చట్టం
# విజయగాథలు

డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ,
తెలంగాణ ప్రభుత్వం

# సమాచార హక్కు చట్టం
# విజయగాథలు

డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ,
తెలంగాణ ప్రభుత్వం

భారత ప్రభుత్వం, సిబ్బంది, ప్రజా సమస్యలు మరియు ఫించన్ల మంత్రిత్వ శాఖ సిబ్బంది మరియు శిక్షణా విభాగం (DoPT) వారి "సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వంలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించు" వార్షిక పథకం (2017-18) క్రింద ఆర్థిక సహాయంతో ఈ పుస్తకం ప్రచురించబడినది.

## ప్రభుత్వ పాలనా కేంద్రం

## (Centre for Public Administration)

## డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ

### ఫ్యాకల్టీ :

డా మాధవి రావులపాటి, అసోసియేట్ ప్రొఫెసర్ అఫ్ లా మరియు సెంటర్ హెడ్

శ్రీ కె. రామ్ గోపాల్, సీనియర్ ఫ్యాకల్టీ

శ్రీమతి కె. సౌమ్య రాణి, జూనియర్ ఫ్యాకల్టీ

శ్రీమతి జి. ఝాన్సీ రాణి, ఫ్యాకల్టీ

డా. కె. సురేష్ కుమార్, జూనియర్ ఫ్యాకల్టీ

### సహాయక సిబ్బంది:

శ్రీ పి. వి. సందీప్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ మరియు వ్యక్తిగత సహాయకులు

శ్రీమతి ఎస్. సత్య లావణ్య, శ్రీ ఐ. రామచంద్ర రావు, శ్రీ పి. గోవర్ధన్ (జూనియర్ అసిస్టెంట్స్)

శ్రీ జి. సాయి కిరణ్, శ్రీ టి. రమేష్ పయ్, శ్రీ ఎ. సంతోష్, (ఆఫీస్ సబోర్డినేట్స్)

**డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ ప్రభుత్వం**
**రోడ్ నం.25, జూబిలీ హిల్స్, హైదరాబాద్-500 033**
**ఫోన్ నం. +91 40 2354 8487, www.mcrhrdi.gov.in**

# ముందుమాట

భారతీయ పౌరులకున్న సమాచార హక్కుని చట్టబద్ధం చేయడానికి, అధికార యంత్రాంగాల అదుపులో ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు తద్వారా ప్రతి అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం కోసం ఉద్దేశించబడినది సమాచార హక్కు చట్టం 2005. ఈ చట్టం అమలు సరిగ్గా జరగడానికి రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగాల కోసం రాష్ట్ర సమాచార కమిషన్, కేంద్ర ప్రభుత్వ అధికార యంత్రాంగాల కొరకు కేంద్ర సమాచార కమిషన్ కూడా స్థాపించడం ఈ చట్టం యొక్క మరొక ముఖ్య ఉద్దేశ్యం.

సహ చట్టం అమలులో భాగస్వాములైనటువంటి పౌరులు, అధికార యంత్రాంగాలు, పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు, మొదటి అప్పీలేట్ అధికారులు మరియు స్వచ్ఛంద సంస్థలకు సహ చట్టంలోని వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడానికి డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణని భారత ప్రభుత్వంలో సమాచార హక్కు చట్టం అమలుని పర్యవేక్షించే సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్స్ మంత్రిత్వ శాఖలోని సిబ్బంది మరియు శిక్షణ విభాగం ఎంపిక చేసింది. సహ చట్టం అమలులో శిక్షణకి సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ భారత ప్రభుత్వం గుర్తించిన ఏకైక నోడల్ శిక్షణ సంస్థ. ఈ సంస్థ కేవలం తెలంగాణ రాష్ట్రంలో మరియు తెలంగాణ ప్రభుత్వంలోని సహ చట్టం అమలులో భాగస్వాములకే కాకుండా దేశవ్యాప్తంగా సహ చట్టం అమలులో భాగస్వాములైన వారికి కూడా గత దశాబ్దకాలంగా శిక్షణ ఇస్తోంది.

సహ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం సహ చట్టంలో నిర్దేశించిన హక్కులను వినియోగించుకునే విషయంలో ప్రజలు, ముఖ్యంగా అణగారిన వర్గాల ప్రజలకు అవగాహనను పెంపొందించుట కోసం ప్రభుత్వం కార్యక్రమాలను రూపొందించి అమలుచేయాలి. ఈ క్రమంలో భాగంగా సహ చట్టం ఉపయోగించి విజయాలు సాధించిన 'అసామాన్యుల' విజయాలను ఒక సంకలనం రూపంలో ప్రచురించి అందుబాటులోకి తేవడం జరుగుతోంది. ఈ సంకలనం మరింతమందికి ప్రేరణ కలిగిస్తుందని, తద్వారా సహ చట్టం యొక్క ప్రయోజనం నెరవేరడానికి ఉపకరిస్తుందని భావించడమైనది. ఈ సంకలనంలోని విజయగాథలు సమాచార హక్కు చట్టం అమలులో పౌరులకు ప్రేరణగా నిలుస్తాయని ఆశిస్తున్నాను.

**బి.పి.ఆచార్య, I.A.S**

**మహా నిర్దేశకులు**

డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ,

తెలంగాణ ప్రభుత్వం

Title of the Book: *Samachara Hakku Chattam: Vijaya Gathalu* (Telugu)

**సమాచార హక్కు చట్టం: విజయగాథలు**


**ప్రచురణ:**

**డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ ప్రభుత్వం**
**రోడ్ నం.25, జూబిలీ హిల్స్, హైదరాబాద్-500 033**
**ఫోన్ నం. +91 40 2354 8487, www.mcrhrdi.gov.in**

ముద్రణ: 2019


ఈ సంకలనం విజయగాథలను ఆయా విజేతలు అందించిన సమాచారం ఆధారంగా రూపొందించడం జరిగింది. ఈ క్రమంలో ఆయా విజయగాథలను మరియు వాటికి సంబంధించిన సమాచారాన్ని పరిశీలించడం జరిగింది. విజేతలు అందించిన సమాచారం ప్రధానంగా వారి దరఖాస్తులు, సమాచార కమిషన్ ఇచ్చిన ఆదేశాలు, వాటి అమలుపై ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు, ఈ విజయాలపై సమాచార, ప్రసార సాధనాలలో వచ్చిన వార్తలను కూడా పరిశీలించడం జరిగింది. ఈ సంకలనంలో ప్రచురించిన విజయగాథలకు సంబంధించిన సమాచారంలో విశ్వసనీయతకు సంబంధించిన అంతిమబాధ్యత ఆయా సమాచారం అందించినవారిదే తప్ప సంస్థకు ఎలాంటి సంబంధం లేదు.

**ఈ పుస్తకంలో ప్రచురించిన విజయగాథలు సేకరించి, అందజేసినవారు :**

| పేరు | విజయ గాథల క్రమ సంఖ్య |
|---|---|
| శ్రీ డి. రాకేశ్ రెడ్డి | 11, 19, 20, 21, 22, 23, 24 |
| శ్రీ మహమ్మద్ అష్రాఫ్ | 1, 2, 6, 10, 17 |
| శ్రీ పి. సురేష్ | 3, 7, 12 |
| శ్రీ పెద్ది మురళి | 5, 9, 15, 16 |
| శ్రీ అంకం నరేష్ | 4, 8, 13, 14 |
| శ్రీ దుర్గం లక్ష్మయ్య | 18 |
| శ్రీ శ్రీపతి పాపన్న | 25 |

యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్.టి.ఐ. కాంపేన్, ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సంస్థలు ఈ విజయగాథల సేకరణలో తోడ్పడ్డాయి.

శ్రీ బి.పి.ఆచార్య, IAS, డైరెక్టర్ జనరల్, డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ ఈ పుస్తక ప్రచురణకోసం తమ మార్గ దర్శకత్వం అందించారు.

శ్రీ మహావీర్ ప్రసాద్ సేథీ, చీఫ్ కన్సల్టెంట్ (శిక్షణ, ఇ-లెర్నింగ్) మరియు శ్రీ డా. షేక్ మహమ్మద్ నబి, డైరెక్టర్ (శిక్షణ) మరియు డా మాధవి రావులపాటి, అసోసియేట్ ప్రొఫెసర్ అఫ్ లా మరియు సెంటర్ హెడ్ తమ విలువైన సూచనలు అందించారు.

శ్రీ కె. శ్రీనివాస రావు, ఆడిట్ అధికారి (శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం, యాదాద్రి)ఈ పుస్తకాన్ని చక్కటి తెలుగులో కూర్పు చేయడానికి సహకరించారు. శ్రీమతి కె. సౌమ్య రాణి, జూనియర్ ఫ్యాకల్టి ఈ విజయగాథల సంకలనంను తీర్చిదిద్దడంలో చేసిన కృషి ప్రశంసనీయం.

# విషయసూచిక


| క్రమ సంఖ్య | విషయము | పేజి నం. |
|---|---|---|
| 1. | నకిలీ దివ్యాంగ ధృవపత్రాల ఆటకట్టించిన సహ చట్టం | 01 |
| 2. | అక్రమ వేతన స్థిరీకరణ ద్వారా పొందిన ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేయించిన సహ చట్టం | 02 |
| 3. | పౌర సమాచార అధికారుల బాధ్యతలు ...సమాచారహక్కు చట్టం(సహ చట్టం) అమలు | 03 |
| 4. | నందు ముఖంలో ఆనందం (సహ చట్టం సహాయంతో ధృవపత్రం సాధించిన దివ్యాంగుడు) | 05 |
| 5. | ఉద్యోగాన్ని ఇప్పించిన సహ చట్టం | 06 |
| 6. | నకిలీ యాత్రల పేరిట ప్రజా ధనం వృధా ఆపిన  సహ చట్టం | 07 |
| 7. | వేల కోట్ల రూపాయల విలువైన కాందిశీకుల భూములు కబ్జా కాకుండా నిలువరించిన సహ చట్టం | 08 |
| 8. | వేతనాలు అందించిన సహ చట్టం | 10 |
| 9. | పాస్ పోర్ట్ ఇప్పించిన సహ చట్టం | 11 |
| 10. | పాలనా వ్యవహారాల్లో ఉర్దూ భాష వాడకాన్ని అమలు చేయించిన సహ చట్టం | 11 |
| 11. | హైదరాబాద్ మహానగరపాలక సంస్థలో విలువైన ప్రజాధనం వృధాని బయటపెట్టిన సహ చట్టం | 12 |
| 12. | అవి వక్ఫ్ భూములు కావు, ఆక్రమణ భూములు — తేల్చిన సహ చట్టం — భూ ఆక్రమణకు కళ్ళెం | 12 |
| 13. | 'ఆసరా'గా నిలిచిన సహ చట్టం | 14 |
| 14. | కరెంట్ (బిల్లు) షాక్ నుండి రాజుని రక్షించిన సహ చట్టం | 15 |
| 15. | సహ చట్టం ద్వారా త్రాగునీరు తీసుకొచ్చిన భగీరథుడు | 16 |

| క్రమ సంఖ్య | విషయము | పేజి నం. |
|---|---|---|
| 16. | దిగివచ్చిన గ్రామపంచాయతీ — సవరించబడిన బకాయిల మొత్తం | 16 |
| 17. | తప్పుడు మెడికల్ బిల్లులతో కాజేసిన ప్రజాధనాన్ని రికవరీ చేయించిన సహ చట్టం | 17 |
| 18. | విలువైన ప్రజాధనం దుర్వినియోగం కాకుండా రికవరీ చేయించిన సహ చట్టం | 18 |
| 19. | నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ సొమ్ముని బ్యాంకులో పెట్టి, వడ్డీ సొమ్ముని కాజేయాలనే వ్యవహారాన్ని బయటపెట్టిన సహ చట్టం | 19 |
| 20. | సహ చట్టం ద్వారా విజిలెన్స్ విభాగంలో పెండింగ్ లో ఉన్న కేసుల సంఖ్య బహిర్గతం | 19 |
| 21. | సహ చట్టం ద్వారా ఎన్నికలలో పోటీచేసే నేరచరితులకు సంబంధించిన సమాచారం వెల్లడి | 20 |
| 22. | ఇండ్ల నిర్మాణం పూర్తి చేయడానికి వీలుగా పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు ఇప్పించిన సహ చట్టం | 20 |
| 23. | అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణపై జారీ చేసిన ఆదేశాల అమలు నిలిపివేసిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం | 21 |
| 24. | అనర్హులైనవారిని సమాచార కమిషనర్లుగా నియమించడం చెల్లదు | 21 |
| 25. | రహదారిపై అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను తొలగించిన సహ చట్టం | 22 |
| 26. | ప్రభుత్వ వైద్యాధికారికే ఆరోగ్య (హెల్త్) కార్డ్ మరియు పెంచిన పెన్షన్‌ని అందించిన సహచట్టం | 22 |
| 27. | సహ కమిషన్ ఆదేశంతో కదిలిన అధికార యంత్రాంగం — పెరిగిన పెన్షన్ | 24 |
| 28. | రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం (హైకోర్ట్) ఆదేశాలను అమలు చేయించిన సహ చట్టం | 24 |
| 29. | తప్పుగా లెక్కించడం ద్వారా రికవరీ చేసిన పెన్షన్ మొత్తాన్ని తిరిగి ఇప్పించిన సహ చట్టం | 25 |
| 30. | సహ చట్టం సహకారంతో మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 అమలుకై చర్యలు | 26 |

## 1. నకిలీ దివ్యాంగ ధృవపత్రాల ఆటకట్టించిన సహ చట్టం

తెలంగాణ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గల పేదరిక నిర్మూలనా సంస్థ (SERP) వైద్య మరియు ఆరోగ్య శాఖతో కలిసి దివ్యాంగుల యొక్క ఆరోగ్య సమస్యలను అంచనావేసి వారికి సాధికారికత కల్పించడం కోసం, దివ్యాంగులకు చట్టబద్ధంగా ఇవ్వాల్సిన దివ్యాంగ పత్రాలను పారదర్శకంగా అందించడానికి ప్రత్యేకంగా ఒక సాఫ్ట్‌వేర్ రూపొందించి (SADAREM [సదరం] – Software for Assessment of Disabled for Access Rehabilitation and Empowerment) అమలులో పెట్టడం జరిగింది. దివ్యాంగులకు ఇవ్వాల్సిన ధృవపత్రాలను వారికి వారున్న చోట లేదా సమీపంలో అందజేయడం కొరకు రాష్ట్రవ్యాప్తంగా వైద్య మరియు ఆరోగ్య శాఖకు చెందిన వైద్యులు మరియు వైద్య సిబ్బందితో కూడిన సదరం శిబిరాలను పేదరిక నిర్మూలన సంస్థ నిర్వహిస్తోంది.

ఈ శిబిరాలలో దివ్యాంగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ప్రభుత్వమే దివ్యాంగ ధృవపత్రాలు జారీచేస్తుంది. ఇలా జారీచేయబడిన ధృవపత్రాలు సదరం వెబ్‌సైట్లో భవిష్యత్ అవసరాలకై భద్రపరచబడతాయి. దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే ప్రయోజనాలు పొందాలంటే సదరం ధృవపత్రం తప్పనిసరి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు (ప్రభుత్వ ఉతర్వు సంఖ్య 31 మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖ (దివ్యాంగుల సంక్షేమం) తేదీ 01.12.2009) జారీచేసింది.

తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు దివ్యాంగులు కాకున్నా దివ్యాంగులుగా (నకిలీ ధృవపత్రాలు సమర్పించి) ప్రభుత్వం నుండి ప్రత్యేక అలవెన్సులు మరియు పదోన్నతులు పొందుచున్నారని కుమురంభీమ్ జిల్లాలో కాగజ్‌నగర్‌కి చెందిన జాగృతి యువ మంచ్‌కి అనుమానం వచ్చింది. ఈ మేరకు సంస్థ జిల్లాలో దివ్యాంగ ధృవపత్రాలను సమర్పించడం ద్వారా ప్రత్యేక అలవెన్స్ పొందుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల వివరాలు సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం సంబంధిత పౌర సమాచార అధికారుల (మండల విద్యాధికారులు) ద్వారా రాతపూర్వకంగా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే సమాచారం ఇవ్వడానికి సంబంధిత పౌర సమాచార అధికారులు స్పందించలేదు. దాంతో ఆ సంస్థ సహ చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం మొదటి అప్పీలేట్ అధికారికి (జిల్లా విద్యాధికారి) అప్పీల్ చేయడం జరిగింది. అప్పీలుని పరిశీలించిన మొదటి అప్పీలేట్ అధికారి దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని వారం రోజుల్లోగా అందించాలని సంబంధిత పౌర సమాచార అధికారులను ఆదేశించారు.

ఇలా సహ చట్టం సహాయంతో పొందిన సమాచారాన్ని పరిశీలించగా కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు సదరం శిబిరాల ద్వారా ఇచ్చే దివ్యాంగ ధృవపత్రాలు లేకుండానే ప్రభుత్వం ఇచ్చే ప్రత్యేక అలవెన్స్ పొందుతున్నారని, ఇది ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులకు వ్యతిరేకం అని గ్రహించిన జాగృతి యువ మంచ్ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌కి రాతపూర్వకంగా సహ చట్టం ద్వారా పొందిన సమాచారం సహితంగా విజ్ఞప్తి చేయడం జరిగింది. దీనిపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించారు.

ఈ లోగా ఈ వ్యవహారం పత్రికల ద్వారా ప్రజలకు తెలిసింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణతో పాటు దివ్యాంగులుగా ప్రభుత్వం నుండి ప్రత్యేక అలవెన్స్ పొందుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల దివ్యాంగ ధృవపత్రాలను కూడా సదరం వద్ద గల డేటాతో సరిపోల్చాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా కలెక్టర్ మరియు తెలంగాణ ప్రభుత్వంలోని సంచాలకులు, దివ్యాంగులు మరియు వృద్ధుల విభాగం, హైదరాబాద్ గారిని కూడా కోరడం జరిగింది.

ఈ మేరకు జరిగిన విచారణ సందర్భంగా దాదాపు 100 మంది ప్రభుత్వ ఉపాధ్యాయుల నకిలీ దివ్యాంగ ధృవపత్రాలతో ప్రభుత్వం నుండి ప్రతినెలా చెల్లిస్తున్న దాదాపు రెండు లక్షల రూపాయల మేరకు ప్రత్యేక అలవెన్సులు పొందుతున్నారని రుజువైంది. ఆ ఉపాధ్యాయులందరికీ సదరం శిబిరాల్లో పరీక్షలు చేయించగా వారిని దివ్యాంగులుగా గుర్తించలేమని వైద్య మరియు ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. దాంతో వారికి ప్రతినెలా ఇస్తున్న ప్రత్యేక అలవెన్సులు తక్షణమే నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాధికారి మరియు జిల్లా ఖజానా మరియు అకౌంట్స్ అధికారులను ఆదేశించడం జరిగింది. అలాగే వారిలో కొందరికి ఇచ్చిన పదోన్నతులపై పూర్తిస్థాయి విచారణ జరిపి తగిన చర్య తీసుకోవాలని కూడా ఆదేశాలు జారీచేయడం జరిగింది. ఫలితంగా ప్రతినెలా దాదాపు రెండు లక్షల రూపాయల మేర ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడబడింది.

## ౨. అక్రమ వేతన స్థిరీకరణ ద్వారా పొందిన ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేయించిన సహ చట్టం

ఒక ప్రభుత్వ శాఖలో ఒకేసారి నియామకమైన ప్రభుత్వ ఉద్యోగులలో సీనియర్ కంటే జూనియర్‌కి ఎక్కువ వేతనం వచ్చే సందర్భాలలో సీనియర్ ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని నివారించడానికి అలాంటి సందర్భాలలో సీనియర్ ఉద్యోగి వేతన స్థిరీకరణ తనకంటే ఎక్కువ వేతనం పొందుతున్న జూనియర్ ఉద్యోగి వేతనంతో సరిచేసుకునే అవకాశం (స్టెప్-అప్ మరియు ప్రి-పోన్ మెంట్ ఫిక్సేషన్) ప్రభుత్వం తన ఉద్యోగులకు కల్పించింది. దీనిని అమలుచేయాలంటే సీనియర్ మరియు జూనియర్ ఉద్యోగులది ఒకే శాఖ, ఒకే విభాగం, ఒకే నియామకం మరియు ఒకే క్యాడర్ అయి ఉండాలని నిబంధన విధించింది. ప్రభుత్వ ఉపాధ్యాయుల విషయంలో ఒకే శాఖ, ఒకే విభాగం, ఒకే నియామకం, ఒకే క్యాడర్, ఒకే మేనేజ్‌మెంట్ మరియు ఒకే సబ్జెక్టు అయి ఉండాలని నిబంధన విధించింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అర్హత లేకున్నా జూనియర్ ఉపాధ్యాయుల వేతనాలతో పోల్చుకొని (స్టెప్-అప్) వేతన స్థిరీకరణ చేసుకొని ప్రభుత్వ ధనాన్ని పొందుతున్నారని కుమురంభీమ్ జిల్లాలో కాగజ్‌నగర్‌కి చెందిన జాగృతి యువ మంచ్‌కి అనుమానం వచ్చింది. ఈ మేరకు సంస్థ జిల్లాలో ౨౦౦౯ నుండి ౨014 మధ్య కాలంలో ఇలా (స్టెప్-అప్) వేతన స్థిరీకరణ చేసుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల వివరాలు సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం సంబంధిత పౌర సమాచార అధికారుల (మండల విద్యాదికారులు) ద్వారా రాత పూర్వకంగా కోరడం జరిగింది.

ఇలా సహ చట్టం సహాయంతో పొందిన సమాచారాన్ని పరిశీలించగా కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు (స్టెప్-అప్) వేతన స్థిరీకరణ పొందడానికి ముఖ్యంగా ఒకే సబ్జెక్ట్ అయి ఉండాలన్న నిబంధనను ఉల్లంఘించి భౌతిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు గణిత శాస్త్రం బోధించే ఉపాధ్యాయులతో పోల్చుకొని, తెలుగు భాషా పండితులు, హిందీ భాషా పండితులతో, ఆంగ్ల భాషా పండితులు వ్యాయామ ఉపాధ్యాయులచేత పోల్చుకొని వారితో సమానంగా వేతన స్థిరీకరణ పొంది ప్రభుత్వ ధనాన్ని అర్హత లేకున్నా పొందుతున్నట్లు తేలింది. దాంతో జాగృతి యువ మంచ్ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా విద్యాధికారికి రాతపూర్వకంగా సహ చట్టం ద్వారా పొందిన సమాచారం సహితంగా విజ్ఞప్తి చేయడం జరిగింది. దీనిపై జిల్లా విద్యాధికారి సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ లోగా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని నాటి రాష్ట్ర సమాచార కమిషనర్ శ్రీ ఇంతియాజ్ అహ్మద్ గారు కూడా విద్యాశాఖని ఆదేశించడం జరిగింది.

ఈ వ్యవహారంపై జరిపిన సమగ్ర విచారణలో జిల్లాలోని దాదాపు 600 మందికి పైగా ఉపాధ్యాయులు ఇలా తప్పుడు విధానం ద్వారా (స్టెప్-అప్) వేతన స్థిరీకరణ పొంది ప్రభుత్వ ఖజానాకు దాదాపు 5 కోట్ల 40 లక్షల రూపాయలు నష్టం కలిగించినట్లు తేలింది. ఈలోగా ఈ వ్యవహారం పత్రికల ద్వారా ప్రజలకు తెలిసింది.

విచారణ నివేదికపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించింది. దాంతో జిల్లా విద్యాశాఖ తప్పుడు వేతన స్థిరీకరణ ద్వారా అధిక వేతనాలు పొందుతున్న వారి వద్ద నుండి అలా పొందుతున్న అధిక వేతనాన్ని అపరాధ రుసుముతో పాటు తిరిగి వసూలు చేసి మొత్తం 5 కోట్ల 40 లక్షల రూపాయలను జమచేయడం జరిగింది. ఆయా ప్రభుత్వ ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించడం జరిగింది.

## 3. పౌర సమాచార అధికారుల బాధ్యతలు ...సమాచారహక్కు చట్టం అమలు

**సమాచార కమిషన్ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయడానికి జోక్యం చేసుకున్న హైకోర్ట్**

**సహ చట్టం కింద వివరాలు ఇవ్వని పౌర సమాచార అధికారి అరెస్ట్**

సహ చట్టం అమలు విషయానికొస్తే ఇదొక సంచలనాత్మక కేసు. సహ చట్టం అమలులో పౌరుడి పట్టుదలకు రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకొని పౌర సమాచార అధికారిని అరెస్ట్ చేయించింది. రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ దరఖాస్తుదారుడు కోరిన సమాచారం ఇవ్వాలని తన పౌర సమాచార అధికారిని ఆదేశించాల్స వచ్చింది. సహ చట్టం అమలులో విఫలమైన సమాచార కమిషనర్‌ని తొలగించాలని గవర్నర్‌కి ఫిర్యాదు చేయాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే......

హైదరాబాద్ నగర శివారులోని పుప్పాలగూడ గ్రామపంచాయతీ పరిధిలోని అక్రమ నిర్మాణాలు, భవన నిర్మాణ లే-అవుట్లలో ప్రజాప్రయోజనాల కొరకు నిబంధనల ప్రకారం వదిలి పెట్టిన ఖాళీస్థలాల వివరాలు కావాలని గ్రామ పౌరుడైన శ్రీ పి. సురేష్ సహచట్టంలోని సెక్షన్ 6 ప్రకారం సమాచారం కొరకు 28.04.2012,

15.09.2012, 27.09.2012, 30.10.2012 తేదీలలో సంబంధిత గ్రామ పంచాయతీ పౌర సమాచార అధికారి/పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేయడం జరిగింది. కానీ దరఖాస్తుదారుడు కోరిన సమాచారం లభించలేదు. దాంతో నిర్ణీత గడువు ముగిసిన తర్వాత మొదటి అప్పీలేట్ అధికారి [పంచాయతీ విస్తరణాధికారి, పంచాయతీ రాజ్ & గ్రామీణాభివృద్ధి] గారికి 10.12.2012 వ తేదీన అప్పీలు చేయడం జరిగింది. అయినప్పటికీ దరఖాస్తుదారుడు కోరుకున్న సమాచారం పొందలేకపోయాడు. దాంతో దరఖాస్తుదారుడైన పి.సురేష్ రాష్ట్ర సమాచార కమిషన్ ముందు సహ చట్టం నిబంధనల ప్రకారం రెండో అప్పీలు తేదీ 28.02.2013 న దాఖలు చేయడం జరిగింది. దీనిపై 06.05.2013 వ తేదీన విచారణ జరిపిన సమాచార కమిషన్ సంబంధిత పౌర సమాచార అధికారికి 15 రోజుల్లోగా దరఖాస్తుదారుడు అడిగిన సమాచారం ఇవ్వాలని ఆదేశించింది.

విచారణకు హాజరుకావాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసినప్పటికీ సంబంధిత పౌర సమాచార అధికారి ఎలాంటి కారణం చెప్పకుండా గైర్హాజరుకావడాన్ని తీవ్రంగా పరిగణించిన కమిషన్ ఆ పౌర సమాచార అధికారికి సహ చట్టంలోని సెక్షన్ 18(3) ప్రకారం ఐదువేల రూపాయల (Rs.5,000/-) జరిమానా విధించాలని నిర్ణయించి ఆ మేరకు షో-కాజ్ నోటీసు జారీచేయాలని నిర్ణయించింది.

సమాచార కమిషన్ ఇచ్చిన ఆదేశాలను తీసుకోవడానికి నిరాకరించిన పౌర సమాచార అధికారి, ఆ ఆదేశాలను అమలు కూడా చేయలేదు. దాంతో ఆగ్రహించిన సమాచార కమిషన్ సంబంధిత పౌర సమాచార అధికారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే హాజరు కావాలని ఆదేశించింది.

కమిషన్ ఆదేశాల ప్రకారం విచారణకు హాజరైన పౌర సమాచార అధికారి విచారణలో సమాచార కమిషనర్‌కి సహకరించక, సమాచార కమిషన్‌తో సరిగ్గా ప్రవర్తించనందుకు మరియు దరఖాస్తుదారుడు సురేష్ కోరిన సమాచారం ఇవ్వకపోవడానికి సరైన కారణాలు చెప్పడంలో విఫలమైనందుకు ఆయనను మందలిస్తూ సహ చట్టంలోని సెక్షన్ 18(3) ప్రకారం ఇరువది ఐదువేల రూపాయల (Rs.25,000/-) అపరాధరుసుము విధించాలని నిర్ణయించి ఆ మేరకు షో-కాజ్ నోటీసు జారీచేయాలని నిర్ణయించింది. అదే విధంగా పౌరుడు అడిగిన సమాచారాన్ని 20 రోజుల్లోగా ఇవ్వాలని ఆదేశించింది. అయినప్పటికీ పౌర సమాచార అధికారి కోరిన సమాచారం ఇవ్వలేదు.

సమాచార కమిషన్ ఇచ్చిన ఆదేశాలను అమలుచేయడంలో పౌర సమాచార అధికారి నిర్లక్ష్యపూరిత వైఖరిని దరఖాస్తుదారుడు పి.సురేష్ హైకోర్ట్ దృష్టికి తెచ్చి సమాచార కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయమని ఆదేశించాలని రిట్ పిటిషన్ దాఖలు చేశారు. (కేసు నంబర్ WP 4271/2014). అయితే పౌర సమాచార అధికారి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం విచారణకు కూడా హాజరు కాలేదు. దాంతో ఆ పౌర సమాచార అధికారిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచాల్సిందిగా హైకోర్ట్ సైబరాబాద్ పోలీసుల్ని ఆదేశించింది (05.03.2014). న్యాయస్థానం ఆదేశాల మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నార్సింగి పోలీస్ స్టేషన్ పోలీసులు సంబంధిత అధికారిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. కేసుని విచారించిన హైకోర్ట్ దరఖాస్తుదారుడు తేదీలు 15.09.2012, 27.09.2012, 30.10.2012,

10.12.2012, 28.02.2013, 03.05.2013 లలో సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం ఇచ్చిన దరఖాస్తులకు సంబందించిన సమాచారం ఇవ్వాలని సంబంధిత గ్రామ పంచాయతీ పౌర సమాచార అధికారిని ఆదేశించింది. ఆ మేరకు దరఖాస్తుదారుడు సమాచారం పొందాడు.

### 4. నందు ముఖంలో ఆనందం (సహ చట్టంతో సహాయంతో ధృవపత్రం సాధించిన దివ్యాంగుడు)

తెలంగాణ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గల పేదరిక నిర్మూలనా సంస్థ (SERP) వైద్య మరియు ఆరోగ్య శాఖతో కలిసి దివ్యాంగుల యొక్క ఆరోగ్య సమస్యలను అంచనావేసి వారికి సాధికారికత కల్పించడం కోసం, దివ్యాంగులకు చట్టబద్ధంగా ఇవ్వాల్సిన దివ్యాంగ పత్రాలను పారదర్శకంగా అందించడానికి ప్రత్యేకంగా ఒక సాఫ్ట్‌వేర్ రూపొందించి (SADAREM [సదరం] – Software for Assessment of Disabled for Access Rehabilitation and Empowerment) అమలులో పెట్టడం జరిగింది. దివ్యాంగులకు ఇవ్వాల్సిన ధృవపత్రాలను వారికి వారున్న చోట లేదా సమీపంలో అందజేయడం కొరకు రాష్ట్రవ్యాప్తంగా వైద్య మరియు ఆరోగ్య శాఖకు చెందిన వైద్యులు మరియు వైద్య సిబ్బందితో కూడిన సదరం శిబిరాలను పేదరిక నిర్మూలన సంస్థ నిర్వహిస్తోంది. ఈ శిబిరాలలో దివ్యాంగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ప్రభుత్వమే దివ్యాంగ ధృవపత్రాలు జారీచేస్తుంది. ఇలా జారీచేయబడిన ధృవపత్రాలు సదరం వెబ్ సైట్ లో భవిష్యత్ అవసరాలకై భద్రపరచబడతాయి. దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే ప్రయోజనాలు పొందాలంటే సదరం ధృవపత్రం తప్పనిసరి.

అలాంటి ఒక శిబిరం నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలో నిర్వహించడం జరిగింది. ఈ శిబిరానికి ఆ మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన దివ్యాంగులు వచ్చి వివిధ రకాల పరీక్షలు నిర్వహించుకోవడం జరిగింది. అలా ఈ శిబిరానికి వాడి గ్రామానికి చెందిన అంకం నందు అనే మూగ బాలుడు కూడా వచ్చి పరీక్షలు చేయించుకున్నాడు. ఈ శిబిరానికి వచ్చిన దివ్యాంగులు అందరికీ వారి యొక్క వికలాంగత్వాన్ని బట్టి దివ్యాంగ ధృవపత్రాలు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా జారీచేయడం జరిగింది. కానీ నందు కి మాత్రం అర్హతలున్నప్పటికీ సదరం శిబిరంలో దివ్యాంగ ధృవపత్రం జారీచేయబడలేదు. ఒకసారి కాదు రెండుసార్లు సదరం శిబిరానికి హాజరైనప్పటికీ, 100% దివ్యాంగుడని వైద్య అధికారులు గుర్తించినప్పటికీ నందు కి ధృవపత్రం జారీకాలేదు. ఫలితంగా ప్రభుత్వం దివ్యాంగుల కొరకు నిర్వహిస్తున్న ప్రత్యేక బడిలో ప్రవేశం లభించలేదు. కారణం ఏమిటాని అడిగితే 'దివ్యాంగ ధృవపత్రం కావాలంటే రేషన్ కార్డు, అందులో పేరు మరియు ఫోటో తప్పనిసరి. అంకం నందు కుటుంబం యొక్క రేషన్ కార్డ్‌లో నందు ఫోటో ఉన్నప్పటికీ పేరు లేనందున దివ్యాంగ ధృవపత్రం' ఇవ్వలేదని అధికారులు సమాధానం చెప్పారు. సదరం శిబిరం ద్వారా దివ్యాంగ ధృవపత్రం పొందడానికి ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది (9) ధృవపత్రాలలో ఒకటి ఉంటే సరిపోతుందని, ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది పత్రాలలో ఒకటైన ఆధార్ కార్డుని నందు కలిగి ఉన్నప్పటికీ రేషన్ కార్డు మాత్రమే కావాలనడం సరికాదని నందు తల్లిదండ్రులు చెప్పినా అధికారులు పట్టించుకోలేదు.

అంకం నందు కుటుంబం స్థానికంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సహ చట్టం రక్షణ వేదిక అధ్యక్షులు నరేష్‌ని సంప్రదించి, వేదిక సహకారంతో సంబంధిత పౌర సమాచార అధికారిని నందుకి దివ్యాంగ ధృవపత్రం ఇవ్వకపోవడానికి గల కారణాలను తెలపాల్సిందిగా సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం చేసిన దరఖాస్తు ద్వారా కోరడం జరిగింది. దానికి సంబంధిత పౌర సమాచార అధికారి సహ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం సమాధానం ఇస్తూ అంతకు ముందు సదరం శిబిర నిర్వాహకులు చెప్పిన సమాధానాన్నే అంటే 'దివ్యాంగ ధృవపత్రం కావాలంటే రేషన్ కార్డు, అందులో పేరు మరియు ఫోటో తప్పనిసరి. అయితే అంకం నందు కుటుంబానికి గల రేషన్ కార్డ్‌లో నందు ఫోటో ఉన్నప్పటికీ నందు పేరు రేషన్ కార్డులో లేనందున దివ్యాంగ ధృవపత్రం ఇవ్వలేదని' రాతపూర్వకంగా తెలియజేసారు.

పౌర సమాచార అధికారి యొక్క ఈ సమాధానంతో సంతృప్తి చెందని అంకం నందు మొదటి అప్పీలేట్ అధికారికి సహ చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం అప్పీలు చేయడం జరిగింది. అప్పీలు విచారణ సందర్భంగా సదరం శిబిరం ద్వారా దివ్యాంగ ధృవపత్రం పొందడానికి ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది (9) ధృవపత్రాలలో ఒకటి ఉంటే సరిపోతుందని, అలా ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది పత్రాలలో ఒకటైన ఆధార్ కార్డుని నందు కలిగి ఉన్నప్పటికీ, ఆ విషయాన్ని సంబంధిత శిబిర నిర్వాహకుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ, వారు దానిని పరిగణనలోకి తీసుకోవడానికి నిరాకరించిన విషయాన్ని అప్పీలేట్ అధికారి దృష్టికి తీసుకుపోవడం జరిగింది.

ఇరు పక్షాల వాదనలు విన్న మొదటి అప్పీలేట్ అధికారి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ కార్డ్ అనేది ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది ధృవపత్రాలలో ఒకటి మాత్రమే. అందులో పేరు లేనంత మాత్రాన ధృవపత్రం జారీచేయకపోవడం సరికాదు అంటూ అంకం నందు యొక్క ఆధార్ కార్డ్ ఆధారంగా ఆ బాలునికి దివ్యాంగ ధృవపత్రం తక్షణమే జారీ చేయాలని సంబంధిత అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీచేయడం జరిగింది. ఆ మేరకు సంబంధిత అధికారులు అంకం నందుకి దివ్యాంగ ధృవపత్రం జారీచేయడం జరిగింది. ఈ ధృవపత్రం ఆధారంగా నందుకి ప్రభుత్వ ప్రత్యేక బడి లో ప్రవేశం లభించింది.

## 5. ఉద్యోగాన్ని ఇప్పించిన సహ చట్టం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం 2002 సంవత్సరంలో ప్రభుత్వ బడులలో ఉపాధ్యాయుల కొరత దృష్ట్యా ఉపాధ్యాయ శిక్షణ లేనటువంటి వారికి ప్రత్యేకంగా ఒక పోటీ పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులైనవారికి శిక్షణ పూర్తి చేసుకోవడానికి అవకాశం ఇచ్చి, శిక్షణ పూర్తయిన తర్వాత రెగ్యులర్ ఉపాధ్యాయులుగా నియమించాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2002 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా పోటీ పరీక్ష నిర్వహించింది. అందులో నిజామాబాద్ జిల్లా కామారెడ్డికి చెందిన సునీల్ ఉత్తీర్ణత సాధించి శిక్షణ-లేని-ఉపాధ్యాయుడుగా నియమించబడ్డాడు. కొద్దికాలం విధులు నిర్వర్తించిన తర్వాత శిక్షణ పూర్తిచేయడానికి పంపబడ్డాడు. కానీ వ్యక్తిగత కారణాల వల్ల శిక్షణ పూర్తికావడానికి సుదీర్ఘ కాలం పట్టింది. చివరికి 2010 సంవత్సరంలో B. Ed. శిక్షణ పూర్తి చేశాడు.

శిక్షణ పూర్తయింది కాబట్టి విధుల్లోకి తీసుకోవాల్సిందిగా స్థానిక విద్యాశాఖాధికారిని లిఖితపూర్వకంగా కోరగా, విధుల్లోకి తీసుకోవాల్సింది పోయి నీవు T.T.C. బదులు B.Ed. పూర్తి చేసావు. కాబట్టి నీకు అర్హత లేదు అంటూ రెండు సంవత్సరాల కాలం సాగదీసి స్థానిక విద్యాశాఖాధికారి తగు మార్గదర్శకత్వం చేయమని కోరుతూ మొత్తం దస్త్రాన్ని ఉన్నత విద్యాశాఖాధికారులకు నివేదించారు.

దాంతో సునీల్ సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం తన యొక్క నియామక దస్త్రంపై తీసుకున్న చర్యల వివరాలను తెలియజేయాల్సిందిగా పౌర సమాచార అధికారి, స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం గారిని కోరడం జరిగింది. కానీ పౌర సమాచార అధికారి సహ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడంతో సహచట్టంలోని సెక్షన్ 19 ప్రకారం సమాచార కమిషన్‌కి అప్పీలు చేసుకోవడం జరిగింది. సమాచార కమిషన్ అప్పీలుని విచారించి సునీల్ దస్త్రంపై నెల రోజుల్లోగా చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించింది. ఫలితంగా సునీల్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా నియమించబడి ప్రస్తుతం కామారెడ్డిలోని R.B.నగర్ మండల పరిషత్ స్కూల్ లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు.

## 6. నకిలీ యాత్రల పేరిట ప్రజా ధనం వృధా ఆపిన సహ చట్టం

ప్రభుత్వ ఉద్యోగులు తమ కుటుంబాలతో కలిసి, నిర్దేశించిన నిబంధనలకు లోబడి ప్రజాధనంతో, స్వరాష్ట్రంలో విహార మరియు విజ్ఞాన యాత్రలు చేయడానికి, ఉద్యోగ కాలంలో ఒకసారి భారత దేశ యాత్ర చేయడానికి సెలవు కాల ప్రయాణ భత్యం (LTC) మంజూరు చేస్తుంది. 2008-09 ఆర్థిక సంవత్సరంలో నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సెలవు కాల ప్రయాణభత్యం పొందిన వారి వివరాలు తెలియజేయాల్సిందిగా సంబంధిత పౌర సమాచార అధికారులను కుమురంభీమ్ జిల్లాలోని కాగజ్‌నగర్‌కు చెందిన జాగృతి యువ మంచ్ సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం కోరడం జరిగింది. ఇలా పొందిన మొత్తం సమాచారంపై నిజనిర్ధారణ చేయాల్సిందిగా జిల్లా విద్యాశాఖాదికారిని కోరడం జరిగింది. జిల్లా విద్యాశాఖాధికారి గారు పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. ఈలోగా ఈ వ్యవహారంపై పత్రికలలో కథనాలు రావడంతో జిల్లా కలెక్టర్ విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.

2008-09 ఆర్థిక సంవత్సరంలో నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బోగస్ బిల్లులతో 2,525 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు 2,02,23,137 రూపాయలు సెలవు కాల ప్రయాణ భత్యం మరియు స్వంతవూరు అలవెన్సులు పొందారని, ఈ మొత్తాన్ని ప్రజాధనం దుర్వినియోగంగా పరిగణించి సంబంధిత ప్రభుత్వ ఉపాధ్యాయుల నుండి అపరాధ రుసుముతో సహా రాబట్టాలని మరియు శాఖాపరమైన విచారణ కూడా చేపట్టాలని ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపిన విజిలెన్స్ విభాగం విద్యాశాఖాధికారులకు సిఫారసు చేసింది. ఈ మేరకు తక్షణమే నిర్దిష్ట చర్యలు చేపట్టాలని విద్యాశాఖ కమిషనర్ ఆదిలాబాద్ జిల్లా విద్యాధికారికి 2011 డిసెంబర్ లో ఆదేశాలు జారీచేసారు. కానీ ఈ ఆదేశాలు అమలుకాలేదు.

ఇంటిలోంచి కాలు కదపకుండా సొంతవూరు కాని సొంతవూర్లకు వెళ్ళివచ్చామని, ఇంటిలోనే దేవుడిని దర్శించుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు దైవ దర్శనానికి వెళ్ళివచ్చామని బోగస్ బిల్లులతో ప్రభుత్వ ధనాన్ని అడ్డదారిలో పొందిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ విభాగం వారు ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల అమలు గూర్చి వివరాలు అందించగలరని సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం సంబంధిత పౌర సమాచార అధికారులని 2015వ సంవత్సరంలో కోరగా కొంతమంది స్పందించారు. మరికొంతమంది అరకొర సమాచారం ఇచ్చారు.

చివరకు ఈ మొత్తం వ్యవహారాన్ని రాష్ట్ర సమాచార కమిషన్ దృష్టికి తీసుకెళ్తే నాటి రాష్ట్ర సమాచార కమిషనర్ శ్రీ ఇంతియాజ్ అహ్మద్ గారి ప్రత్యేక చొరవతో జిల్లా విద్యాశాఖాధికారి గారు మొత్తం 2 కోట్ల 28 లక్షల రూపాయలను సంబంధిత ప్రభుత్వ ఉపాధ్యాయుల నుండి రికవరీ చేసి ప్రభుత్వ ఖజనాకు జమ చేయించారు. ప్రభుత్వ ధనాన్ని అక్రమ పద్ధతులలో పొందడానికి ప్రయత్నించిన ప్రభుత్వ ఉపాధ్యాయులపై అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం ఇకపై సెలవు కాల ప్రయాణ భత్యం పొందడానికి వీలు లేకుండా నిషేధం విధించారు.

ఈ వ్యవహారాన్ని బయటకు తేవడమే గాకుండా విలువైన ప్రభుత్వ ధనాన్ని తిరిగి రాబట్టడంలో కీలక పాత్ర పోషించిన జాగృతి యువ మంచ్ సభ్యుడు వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ప్రవృత్తి రీత్యా సహ చట్టం కార్యకర్త అయిన మహమ్మద్ అష్రఫ్ కృషిని నాటి సమాచార కమిషనర్ శ్రీ ఇంతియాజ్ అహ్మద్ గారు ప్రత్యేకంగా అభినందించారు. అదే సమయంలో ఈయనకు ఎదురయ్యే ప్రమాదాల నుండి భద్రత కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ప్రత్యేకంగా సూచించారు.

### 7. వేల కోట్ల రూపాయల విలువైన కాందిశీకుల భూములు కబ్జా కాకుండా నిలువరించిన సమాచారహక్కు చట్టం

సహ చట్టం అమలు విషయానికొస్తే ఇదొక సంచలనాత్మక కేసు. సహ చట్టం అమలులో పౌరుడి పట్టుదలకు రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకొని విలువైన ప్రభుత్వ భూములను కాపాడడమే కాకుండా ఆక్రమణల పాలుకాకుండా స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. వివరాల్లోకి వెళితే......

భారత దేశ స్వాతంత్ర్యవేళ జరిగిన విభజన సందర్భంగా భారత దేశం నుండి పాకిస్తాన్‌కి వెళ్ళిపోయిన వారి యొక్క ఆస్తులను స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం వాటిని కాందిశీకుల ఆస్తులు/భూములుగా రికార్డుల్లో నమోదు చేసి భారత ప్రభుత్వం జారీచేసిన నిర్వాసితులు (పరిహారం మరియు పునరావాసం) చట్టం 1954 మరియు నిర్వాసితుల భూమి పాలన చట్టం 1950 ప్రకారం వాటికి సంరక్షకురాలిగా ఉంటూ వచ్చింది. ఇలాంటి కాందిశీకుల భూములు రంగారెడ్డి జిల్లా గండిపేట (గతంలో రాజేంద్రనగర్) మండలం పుప్పాలగూడ గ్రామ రెవిన్యూ పరిధిలో సుమారు 977.28 ఎకరాలున్నాయి. ఈ భూములలో కొద్ది భూములను పాకిస్తాన్ నుండి వచ్చిన శరణార్థుల (కాందిశీకులు)కు ప్రభుత్వం కేటాయించింది. ఇలా భూకేటాయింపులు పొందినవారిలో ఒకరు పరశురాం రాంచంద్ మంగిర్ మలానీ.

సర్వే నంబర్లు 301 నుండి 308 వరకు, 325 నుండి 328 వరకు మరియు 331లో ఒక భాగం (పార్ట్)లోని 198.30 ఎకరాలలో ఆయనకు 1953 లో కేటాయించిన భూమిపై ఆయన మరణాంతరం హక్కుల బదలాయింపు కోరుతూ రమేష్ పరశురాం మలానీ ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఆశ్రయించారు. రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ మండలంలోని పుప్పాలగూడలో గల 323 ఎకరాల భూమిని దరఖాస్తుదారుడికి కట్టబెడుతూ 2003 ఫిబ్రవరి 26 న భూపరిపాలన ప్రధాన కమిషనర్ (CCLA) ఆదేశాలు జారీచేసారు. ఆ తర్వాత ఈ కేటాయింపులను సమర్థిస్తూ 2006 జూన్ 28న రాష్ట్ర ప్రభుత్వ రెవిన్యూ కార్యదర్శి కూడా ఉత్తర్వులు జారీచేసారు.

అయితే ఇలా ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడం నిబంధనలకు విరుద్ధమని ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని రకాల సమాచారం కావాలని పుప్పాలగూడ గ్రామ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు పి. సురేష్ సహ చట్టం ద్వారా రాజేంద్రనగర్ తహసిల్దార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మరియు భూపరిపాలన ప్రధాన కమిషనర్, హైదరాబాద్ వద్ద దరఖాస్తులు చేయడం జరిగింది. ఇలా సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ప్రభుత్వ ఆదేశాలతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ చేపట్టిన విచారణలో నిబంధనలకు వ్యతిరేకంగా భూముల కేటాయింపు జరిగినట్టు నిర్ధారణ కావడంతో వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ని ఆదేశించింది.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భూకేటాయింపులను సమర్థిస్తూ 2006 జూన్ 28న రాష్ట్ర ప్రభుత్వ రెవిన్యూ కార్యదర్శి జారీచేసిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్ట్‌ని ఆశ్రయించారు (రిట్ పిటిషన్స్ WP No 14066/2006 మరియు 14027/2006). అసలైన నిర్వాసితుడు 1988లోనే మరణించారని, నిర్వాసితుల వారసుల హోదాలో దశాబ్దాల తర్వాత రమేష్ మలానీ నుండి దరఖాస్తు తీసుకొని భూమిపై హక్కులు బదలాయించారని, ఇవి చెల్లవని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ (పిటిషనర్) వాదించారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ వాదనతో ఏకీభవించిన హైకోర్ట్ ఈ కేటాయింపులు/భూమిపై హక్కుల బదలాయింపు చెల్లదని నాటి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దిలీప్ బి భోసలే మరియు జస్టిస్ ఎస్.వి.భట్ లతో కూడిన ధర్మాసనం 2016 ఫిబ్రవరి 12న తీర్పు వెల్లడించింది. విపరీత కాలయాపన తర్వాత వచ్చిన దరఖాస్తులను/విజ్ఞప్తులను నిర్వాసితులు (పరిహారం మరియు పునరావాసం) (DPCR) చట్టం 1954 మరియు నిర్వాసితుల భూమి పాలన చట్టం 1950 కింద అనుమతించరాదని, అసాధారణ రీతిలో కాందిశీకులకు పరిహారం చెల్లించడం సరికాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రధాన భూపరిపాలన కమిషనర్ ఉద్దేశ్యపూర్వకంగా అధికారాన్ని ఉపయోగించారని, ప్రధాన భూపరిపాలన కమిషనర్ మరియు రెవిన్యూ కార్యదర్శి జారీచేసిన ఉత్తర్వుల వెనుక కీలకమైన అదృశ్య శక్తులున్నాయని, ఆ శక్తులే ఈ కేటాయింపుల్లో కీలకపాత్ర పోషించారని ధర్మాసనం అభిప్రాయపడింది. అర్హత లేని వ్యక్తులు ఇచ్చిన వినతి పత్రాల ఆధారంగా ప్రధాన భూపరిపాలన కమిషనర్ తనకు గల అధికారాలను ఉపయోగించుకుంటూ చేసిన కేటాయింపులు,

వాటిని రెవిన్యూ శాఖా కార్యదర్శి ఆమోదించడం సహజ న్యాయసుత్రాలకు విరుద్ధమని ధర్మాసనం స్పష్టం చేసింది. రికార్డుల్లో పరశురాం రాంచంద్ మలానీ కాస్తా పరశురాం రాంచంద్ మంగిర్ మలానీగా మార్చడాన్ని ఎత్తిచూపుతూ, ఇలా రికార్డులను మార్చడం ద్వారా, అధికారాలను పరిధి దాటి ఉపయోగించడం ద్వారా చేసిన కేటాయింపులను, జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్ట్ ధర్మాసనం కొట్టివేసింది.

కాందిశీకుల భూములపై రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక తెచ్చింది. కాందిశీకుల భూముల యొక్క వ్యవహారంపై సమగ్ర దర్యాప్తుకి ఆదేశించిన ప్రభుత్వం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ శివారులో దాదాపు 11 వందల ఎకరాల భూమి అన్యాక్రాంతమైనట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవడానికి నడుంబిగించింది.

పౌరుల నిరంతర జాగరూకతకు సహ చట్టం తోడవడంతో ఇప్పటివరకు జరిగిన అన్యాయాలు, అక్రమాలు బయటపడడంతో వాటి విషయంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవడంతో విలువైన భూముల పరిరక్షణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## 8. వేతనాలు అందించిన సహ చట్టం

గ్రామీణ నిరుపేదల కుటుంబాలకు ఏడాదికి కనీసం 100 రోజులు ఉపాధి కల్పించాలన్న సదాశయంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం దేశవ్యాప్తంగా అమలవుతోంది. ఈ పథకం యొక్క రాజీలేని అంశాల్లో ఒకటి పనిచేసిన కూలీలకు సకాలంలో వేతనాలు అందించడం.

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండల కేంద్ర గ్రామంలో గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన 60 మంది కూలీలకు నాలుగు సంవత్సరాలుగా వేతనాలు చెల్లించడం లేదని ఆ గ్రామీణులలో ఒకరైన గంట గంగుబాయి నిజామాబాద్ జిల్లా సహ చట్టం రక్షణ వేదికని సంప్రదించి, వేదిక సహకారంతో, మరో ఇద్దరు సహచరులతో (హరీష్ మరియు అశోక్) కలిసి సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం నాలుగు సంవత్సరాలుగా వేతనాలు చెల్లించకపోవడానికి గల కారణాలను తెలియజేయాల్సిందిగా పౌర సమాచార అధికారి, జక్రాన్‌పల్లి మండల పరిషత్ గారిని కోరడం జరిగింది.

కానీ పౌర సమాచార అధికారి సహ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందని దరఖాస్తుదారులు మొదటి అప్పీలేట్ అధికారికి సహచట్టంలోని సెక్షన్ 19(1) ప్రకారం అప్పీలు చేసుకోవడం జరిగింది. అక్కడ కూడా సంతృప్తికరమైన సమాధానం లభించకపోవడంతో సమాచార కమిషన్‌కి సెక్షన్ 19(3) ప్రకారం రెండో అప్పీలు చేసుకోవడం జరిగింది. సమాచార కమిషన్ నుండి పౌర సమాచార అధికారికి విచారణ నిమిత్తం హాజరుకమ్మని నోటీసులు జారీ కావడంతో సంబంధిత కార్యక్రమ అధికారి/మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆ 60 మందికి రావాల్సిన వేతనాలను చెల్లించడం జరిగింది. ఒక్కొక్కరికి 1470 రూపాయల నుండి 4770 రూపాయల వేతన బకాయిలు చెల్లించబడ్డాయి.

## 9. పాస్ పోర్ట్ ఇప్పించిన సహ చట్టం

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలోని పడ్కల్ గ్రామానికి చెందిన సంగు జైపాల్ ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్ళాలని నిర్ణయించుకొని, విదేశాలకు వెళ్ళడానికి కావాల్సిన పాస్ పోర్ట్ కొరకై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సికిందరాబాద్ పాస్ పోర్ట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఆ తర్వాత భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా నిర్వహించబడే ఆన్-లైన్ విధానంలో తన పాస్ పోర్ట్ జారీ అయిందా లేదా అని తనిఖీ చేసుకుంటే పాస్ పోర్ట్ జారీ అయినట్లుగా ఉంది. కానీ ఎనిమిది (8) నెలలు గడచినా పాస్ పోర్ట్ రాలేదు. ఆ తర్వాత మళ్ళీ ఆన్-లైన్ విధానంలో తనిఖీ చేయగా అందులో పాస్ పోర్ట్ జారీ చేయబడినట్లు, దానిని జైపాల్ తీసుకోకపోవడం వల్ల తిరిగి పాస్ పోర్ట్ కార్యాలయానికే చేరినట్లు ఉంది.

హతాశుడైన జైపాల్ సంబంధిత పౌర సమాచార అధికారి, పాస్ పోర్ట్ కార్యాలయం, సికిందరాబాద్ గారిని తనకు పాస్ పోర్ట్ ఇవ్వకపోవడానికి గల కారణాలు తెలపాల్సిందిగా సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం చేసిన దరఖాస్తు ద్వారా కోరడం జరిగింది. దాంతో సంబంధిత పౌర సమాచార అధికారి, పాస్ పోర్ట్ కార్యాలయం, సికిందరాబాద్ గారు సహ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం సమాధానం ఇస్తూ 20 రోజులలో జైపాల్‌కి పాస్ పోర్ట్ అందజేయడం జరిగింది.

## 10. పాలనా వ్యవహారాల్లో ఉర్దూ భాష వాడకాన్ని అమలు చేయించిన సహ చట్టం

భారత ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దేశంలోని ప్రభుత్వాలన్నీ పరిపాలనా వ్యవహారాల్లో త్రిభాషా సూత్రాన్ని అమలు చేయాల్సిందే. అంటే పాలనా వ్యవహారాల్లో ప్రాపంచిక వ్యవహారిక భాష ఆంగ్లం, జాతీయ భాష హిందీ, స్థానిక భాషలను పరిపాలనలో విధిగా ఉపయోగించాలి. ఈ ఆదేశాల ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరియు ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో పాలనా వ్యవహారాల్లో ప్రాపంచిక వ్యవహార భాష ఆంగ్లం, జాతీయ భాష హిందీ మరియు రాష్ట్ర భాషలుగా తెలుగు మరియు ఉర్దూ భాషలను విధిగా ఉపయోగించాలని ప్రభుత్వాలు ఆదేశాలు జారీచేశాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలనా వ్యవహారాల్లో ఉర్దూ భాష అమలుపై ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలుచేయడంపై ముఖ్యంగా ఉర్దూ భాషలో నామ ఫలకాల ఏర్పాటుపై వివరాలు కావాలంటూ కుమురంభీమ్ జిల్లాలో కాగజ్‌నగర్‌కి చెందిన జాగృతి యువ మంచ్ సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం సంబంధిత పౌర సమాచార అధికారుల (మండల విద్యాధికారులు) ద్వారా రాత పూర్వకంగా దరఖాస్తు చేయడం జరిగింది. సహ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం పౌర సమాచార అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం జిల్లాలో త్రిభాషాసూత్రం సరిగ్గా అమలుకావడం లేదని, త్రిభాషా సూత్రాన్ని సరిగ్గా అమలు చేసేలా చర్యలు తెలుసుకోవడానికి నిర్దిష్ట ఆదేశాలు జారీచేయగలరని జిల్లా కలెక్టర్‌ని కోరగా ఆ మేరకు జిల్లా కలెక్టర్ మరోసారి ఆదేశాలు జారీ చేసారు. ఈ విషయాన్ని పత్రికలు మరియు మీడియా

కూడా ప్రధానంగా ప్రసారం చేయడంతో జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు తెలుగు, ఆంగ్లంతో పాటు ఉర్దూలో కూడా నామఫలకాలు ఏర్పాటు చేయడం జరిగింది.

### 11. హైదరాబాద్ మహానగరపాలక సంస్థలో విలువైన ప్రజాధనం వృధాని బయటపెట్టిన సమాచార హక్కు చట్టం

వర్షాకాలం వచ్చిందంటే చాలు హైదరాబాద్ మహానగరపాలక సంస్థ పరిధిలో గల రహదారులు చెరువులు, వాగులను తలపిస్తుంటాయి. ఇందుకు గల ప్రధానకారణం నగరపాలక సంస్థ పరిధిలో వర్షాల కారణంగా వచ్చే వరదనీరు త్వరగా వెళ్ళడానికి వీలుగా నిర్మించిన నాలాలు పూడికతో నిండిపోవడమే. ప్రతి సంవత్సరంలో హైదరాబాద్ మహానగరపాలక సంస్థ వర్షాకాలానికి ముందే నాలాలలో గల పూడిక తీసివేసి వాటిలో వర్షపునీరు వెళ్ళడానికి వీలుగా చేయడానికి కొంత ధనం కేటాయిస్తుంది. అయితే ఈ డబ్బు ఖర్చు విషయం మరియు సాధించిన ఫలితాల వివరాలు కావాలని హైదరాబాద్ లోని స్వచ్ఛంద సంస్థ సుపరిపాలన వేదిక ప్రతినిధులు హైదరాబాద్ మహానగరపాలక సంస్థని సహ చట్టం ద్వారా కోరగా అందించిన సమాచారం ప్రకారం విలువైన ప్రజాధనం నాలాల పూడిక కొరకు వెచ్చిస్తున్నా క్షేత్రస్థాయిలో పూడిక వెలికితీత జరగడం లేదని, నిధుల కేటాయింపు, ఖర్చు మరియు ఆశించిన ఫలితాలకు మధ్య చాలా తేడా ఉందనే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన సమాచారం ఆధారం చేసుకొని విలువైన ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని ఫిర్యాదు చేస్తే మొత్తం విషయాన్ని హైదరాబాద్ మహానగరపాలక సంస్థ అవినీతి నిరోధక శాఖకి విచారణ నిమిత్తం అప్పగించింది. ప్రస్తుతం విచారణ జరుగుతోంది.

### 12. అవి వక్ఫ్ భూములు కావు, ఆక్రమణ భూములు — తేల్చిన సహ చట్టం — భూ ఆక్రమణకు కళ్ళెం

సహ చట్టం అమలు విషయానికొస్తే ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టిన కేసు. సహ చట్టం అమలులో పొరుడి పట్టుదల కారణంగా పరస్పర విరుద్ధమైన ప్రభుత్వ వాదనలను, అదీ కూడా సర్వోన్నత న్యాయస్థానాల ముందు, బయటపెట్టిన ఉదంతం. చివరకు ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను ప్రారంభించి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై కేసులునమోదుచేసి క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించింది. వివరాల్లోకి వెళితే.....

హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ పరిధిలోని రాజేంద్రనగర్ మండలం మణికొండ గ్రామంలోని సర్వే నంబర్లు 3057,3058 మరియు 3059 పరిధిలోని భూములు వక్ఫ్ బోర్డుకి చెందిన భూములా? కాదా? [దర్గా హుస్సేన్ షా వలీ కి చెందినవా? కాదా?]అనే విషయమై సందేహం వచ్చింది. దాంతో వక్ఫ్ బోర్డు అసిస్టెంట్ సర్వే కమిషనర్ రీ-సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా ఈభూమిని వక్ఫ్ బోర్డ్ కి చెందినవిగా గుర్తిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ F.No.M1/69/PROT/PR/2004 తేదీ 13.3.2006 జారీచేసింది. దాంతో ఈ భూముల క్రయవిక్రయాలను రిజిస్ట్రేషన్ శాఖ నిలిపివేసింది.

అయితే ఈ భూములు వక్ఫ్ బోర్డుకి చెందినవి కావని, వక్ఫ్ బోర్డు అసిస్టెంట్ సర్వే కమిషనర్ చేసిన రీ-సర్వే లోపభూయిష్టమని, రికార్డులని తారుమారు చేయడం జరిగిందని అనుమానాలు వ్యక్తం అయ్యాయి.

ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని రకాల సమాచారం కావాలని పుప్పాలగూడ గ్రామ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు పి. సురేష్ సహ చట్టం ద్వారా రాజేంద్రనగర్ తహసిల్దార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మరియు భూపరిపాలన ప్రధాన కమిషనర్, హైదరాబాద్ వద్ద దరఖాస్తులు చేయడం జరిగింది. ఇలా సమాచార చట్టం ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది.

ప్రభుత్వ ఆదేశాలతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ చేపట్టిన విచారణలో వక్ఫ్ అసిస్టెంట్ సర్వే కమిషనర్ సమర్పించిన నివేదికలో అసలు వివరాలను ట్యాంపరింగ్ చేసినట్లు నిర్ధారణ అయింది. రీ-సర్వే నివేదికలో వక్ఫ్ ఆస్తులు అని ఉన్న 11 వ కాలమ్‌లో వాస్తవంగా 'Nil' అని రాసి ఉండగా, దానిని కొట్టివేసి మణికొండ జాగీర్‌కి సంబంధించిన సర్వే నంబర్లన్నీ దానికి ఎదురుగా (ఆ 11 వ కాలమ్ లో) రాసి మొత్తం 1654.32 ఎకరాలను వక్ఫ్ ఆస్తులుగా చూపారు.

అంతేకాకుండా మణికొండ గ్రామం మరియు వార్డులు ఉండాల్సినచోట దర్గా హుస్సేన్ షా వలీ అని రాయడం జరిగింది. కానీ 1954-55 ఖాస్రా పహాణీలో ఈ భూములు ఇతరుల పేరిట ఉన్నాయి.

రాజేంద్రనగర్‌కి చెందిన భూముల విషయంలో పక్క మండలమైన శేరిలింగంపల్లికి చెందిన తహసిల్దార్ ఎలా సంతకం చేస్తాడని అనుమానం వచ్చిన అధికారులు విచారణ చేపట్టగా ఈ రెండో దఫా సర్వేపై తాను ఎలాంటి సంతకం చేయలేదని, ఆ సమయంలో నేను రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి తహసిల్దార్ గా పనిచేయలేదని, అప్పటికే మెదక్ జిల్లాకు బదిలీ అయ్యాయని ఆ సర్వే నివేదికపై సంతకం చేశారని భావిస్తున్న శేరిలింగంపల్లి తహసిల్దార్ రాతపూర్వకంగా స్పష్టం చేశారు. దాంతో ఆయన సంతకం కూడా ఫోర్జరీ చేయడం జరిగిందని, ఒక మండలం పరిధిలోని భూములపై మరో మండలం యొక్క తహసిల్దార్‌కి అధికారాలు లేవని తేల్చిన రెవిన్యూ యంత్రాంగం సహ చట్టం కింద సమర్పించిన ఆధారాలు సరైనవేనని, తప్పు జరిగిందని నిర్ధారణకు వచ్చింది.

ఈ మేరకు రెవిన్యూ శాఖ విచారణలో బయటపడిన ఈ విషయాలన్నీ తెలియజేస్తూ నాటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి ప్రత్యేక లేఖ (D.O. Letter No. F1/4615/2007 తేదీ 13.09.2007) రాశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రత్యేక లేఖలోని అంశాలను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టమని ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు రికార్డులను తారుమారు చేసి, సంతకాలను ఫోర్జరీ చేసిన ఇద్దరు అధికారులపై కేసులు పెట్టి, వారిపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించింది.

మరోవైపు ప్రభుత్వం ఈ భూమి వక్ఫ్ బోర్డుకి చెందినది కాదు కాబట్టి ఈ భూముల విషయంలో ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌలిక వసతుల కల్పన కార్పోరేషన్ (APIIC) ఆధ్వర్యంలో జరిగిన భూకేటాయింపులు సరైనవేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిపై దర్గా హుస్సేన్ షా వలీ హైకోర్ట్‌ని ఆశ్రయించగా వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ లోనే కేసుని పరిష్కరించుకోవాలని సూచించింది. హైకోర్ట్ తీర్పుని దర్గా సుప్రీమ్ కోర్ట్‌లో సవాలు చేయగా ప్రభుత్వం 'మణికొండ గ్రామంలో వివిధ సంస్థలకు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌలిక వసతుల కల్పన

కార్పోరేషన్ (APIIC) కేటాయించిన భూమి వక్ఫ్ భూమి కానేకాదు, ఒకవేళ అది నిజంగా వక్ఫ్ భూమి అయితే ఆ మేరకు భూమికి భూమి లేదా పరిహారం ఇస్తాం' అని ప్రమాణ పత్రం జారీ చేసింది.

పౌరుల నిరంతర జాగరూకతకు సహ చట్టం తోడవడంతో ఇప్పటివరకు జరిగిన భూ ఆక్రమణ వ్యవహారం బయటపడి, వాటి విషయంలో నిబంధనల ప్రకారం వ్యవహరిస్తామని ఉన్నత న్యాయస్థానానికి ప్రభుత్వం ప్రమాణ పూర్వకంగా చెప్పడమే కాకుండా విలువైన భూముల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## 13. 'ఆసరా'గా నిలిచిన సహ చట్టం

తెలంగాణ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గల పేదరిక నిర్మూలనా సంస్థ (SERP) వైద్య మరియు ఆరోగ్య శాఖతో కలిసి దివ్యాంగుల యొక్క ఆరోగ్య సమస్యలను అంచనావేసి వారికి సాధికారికత కల్పించడం కోసం, దివ్యాంగులకు చట్టబద్ధంగా ఇవ్వాల్సిన దివ్యాంగ పత్రాలను పారదర్శకంగా అందించడానికి ప్రత్యేకంగా ఒక సాఫ్ట్‌వేర్ రూపొందించి (SADAREM [సదరం] – Software for Assessment of Disabled for Access Rehabilitation and Empowerment) అమలులో పెట్టడం జరిగింది. దివ్యాంగులకు ఇవ్వాల్సిన ధృవపత్రాలను వారికి వారున్న చోట లేదా సమీపంలో అందజేయడం కొరకు రాష్ట్రవ్యాప్తంగా వైద్య మరియు ఆరోగ్య శాఖకు చెందిన వైద్యులు మరియు వైద్య సిబ్బందితో కూడిన సదరం శిబిరాలను పేదరిక నిర్మూలన సంస్థ నిర్వహిస్తోంది. ఈ శిబిరాలలో దివ్యాంగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ప్రభుత్వమే దివ్యాంగ ధృవపత్రాలు జారీచేస్తుంది. ఇలా జారీచేయబడిన ధృవపత్రాలు సదరం వెబ్‌సైట్‌లో భవిష్యత్‌అవసరాలకై భద్రపరచబడతాయి. దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే ప్రయోజనాలు పొందాలంటే సదరం ధృవపత్రం తప్పనిసరి.

అలాంటి ఒక శిబిరం నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి మండలంలో నిర్వహించడం జరిగింది. ఈ శిబిరానికి ఆ మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన దివ్యాంగులు వచ్చి వివిధ రకాల పరీక్షలు నిర్వహించుకోవడం జరిగింది. అలా ఈ శిబిరానికి పడ్కల్ గ్రామానికి చెందిన మద్ది సంగయ్య అనే దివ్యాంగుడు (మానసిక వైకల్యం) కూడా వచ్చి పరీక్షలు చేయించుకున్నాడు. (సంగయ్య కుటుంబం ఉపాధి నిమిత్తం పడ్కల్ గ్రామానికి ఐదు సంవత్సరాల క్రితం వలస వచ్చింది.)

ఈ శిబిరానికి వచ్చిన దివ్యాంగులు అందరికీ వారి యొక్క వికలాంగత్వాన్ని బట్టి దివ్యాంగ ధృవపత్రాలు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా జారీచేయడం జరిగింది. కానీ సంగయ్యకి మాత్రం అర్హతలున్నప్పటికీ సదరం శిబిరంలో దివ్యాంగ ధృవపత్రం జారీచేయబడలేదు. ఒకసారి కాదు రెండుసార్లు (2014 మరియు 2015) సదరం శిబిరానికి హాజరైనప్పటికీ, దివ్యాంగుడని వైద్య అధికారులు గుర్తించినప్పటికీ సంగయ్యకు ధృవపత్రం జారీకాలేదు. కారణాలు కూడా తెలియజేయలేదు.

సంగయ్య కుటుంబం స్థానికంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సహ చట్టం రక్షణ వేదిక అధ్యక్షులు నరేష్‌ని సంప్రదించి, వేదిక సహకారంతో సంబంధిత పౌర సమాచార అధికారిని సంగయ్యకి దివ్యాంగ ధృవపత్రం ఇవ్వకపోవడానికి గల కారణాలను తెలపాల్సిందిగా రాతపూర్వకంగా సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం చేసిన దరఖాస్తు ద్వారా సెప్టెంబర్ 2015 లో కోరడం జరిగింది. దానికి సంబంధిత పౌర సమాచార అధికారి గారు సహ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం సమాధానం ఇస్తూ సంగయ్యకి ఇవ్వాల్సిన దివ్యాంగ ధృవపత్రం యొక్క నకలును ఇవ్వడం జరిగింది. అసలు ధృవపత్రం ఇవ్వడానికి ఇంకా కొంత సమయం కావాలని కోరడం జరిగింది. మూడు నెలలు వేచి చూసిన తర్వాత జనవరి 2016 లో తిరిగి సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేయగా స్పందించిన పౌర సమాచార అధికారి సహ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం సమాధానం ఇస్తూ ఫిబ్రవరి 2016 స్థానిక ఇందిరా క్రాంతి పథం కార్యాలయం ద్వారా సంగయ్యకి రావాల్సిన దివ్యాంగ ధృవపత్రం ఇవ్వడం జరిగింది. ఈ ధృవపత్రం ఆధారంగా సంగయ్యకి తెలంగాణ ప్రభుత్వం ఆసరా పెన్షన్స్‌లో భాగంగా ప్రతి నెలా ఇచ్చే దివ్యాంగ పెన్షన్ మంజూరు చేసింది.

## 14. కరెంట్ (బిల్లు) షాక్ నుండి రాజుని రక్షించిన సహ చట్టం

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని దేగాం గ్రామానికి చెందిన గడ్డం రాజు పేదవాడు. చిన్న పూరిల్లు వేసుకొని నివసిస్తున్నాడు. రెండు బల్బులు మరియు ఒక ఫ్యాన్ కలిగిన తన ఇంటికి రెండు నెలల (2015 సంవత్సరంలో ఫిబ్రవరి మరియు మార్చి) విద్యుత్ బిల్లు 61,271/- రూపాయలు రావడంతో షాక్ తిన్న రాజు, కరెంట్ మీటర్‌ని పరిశీలించి, తన ఇంట్లో విద్యుత్ వాడే ఉపకరణాల ఆధారంగా బిల్లు విధించమని అధికారులను కోరినప్పటికీ వారు పెడచెవిన పెట్టడం జరిగింది.

దాంతో రాజు స్థానికంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సహచట్టం రక్షణ వేదికని సంప్రదించి, వేదిక సహకారంతో సంబంధిత పౌర సమాచార అధికారిని ఇంత పెద్ద మొత్తంలో కరెంట్ బిల్లు రావడానికిగల కారణాలు మరియు తీసుకునే చర్యల వివరాలు తెలపాల్సిందిగా రాతపూర్వకంగా సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం చేసిన దరఖాస్తు ద్వారా కోరడం జరిగింది.

దానికి సహ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం సంబంధిత పౌర సమాచార అధికారి (విద్యుత్ శాఖ) గారు సమాధానం ఇస్తూ కరెంట్ మీటర్‌లో లోపం కారణంగా అలా పెద్ద మొత్తంలో బిల్లు వచ్చిందని గుర్తించి, ఆ మీటర్‌ని బాగుచేయడమే గాకుండా, రాజు వాడే విద్యుత్ ఉపకరణాల ఆధారంగా ఆ రెండు నెలల కాలానికి 990 రూపాయలు చెల్లించమని సమాధానం ఇచ్చారు. ఇలా సహ చట్టం సహాయంతో రాజు (అధిక) కరెంట్ (బిల్లు) షాక్ నుండి తనను తాను కాపాడుకున్నాడు.

## 15. స.హ.చట్టం ద్వారా త్రాగునీరు తీసుకొచ్చిన భగీరథుడు

వేసవిలో త్రాగునీటి ఎద్దడిని నివారించి ప్రజలకు త్రాగునీరు అందించడానికై ప్రభుత్వం నిజామాబాద్ జిల్లాకి ఒక కోటి ఎనభై లక్షల రూపాయలు మజూరు చేసింది. వీటి ఉపయోగం సరిగ్గా జరగలేదని అనుకున్న సహ చట్టం రక్షణ వేదిక, జక్రాన్‌పల్లి మండల సమన్వయకులు, మండలంలోని కొలిపాక గ్రామానికి చెందిన పెద్ది మురళి సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం ప్రభుత్వం మంజూరు చేసిన కోటి ఎనభై లక్షల రూపాయల వినియోగానికి సంబంధించిన వివరాలు ఇవ్వగలరని పౌర సమాచార అధికారి, జిల్లా గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగం గారిని లిఖిత పూర్వకంగా కోరడం జరిగింది.

పౌర సమాచార అధికారి గారు సహ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం ఇచ్చిన సమాచారం ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా వేల్పూరు మండలంలోని అక్లూర్ గ్రామానికి ప్రభుత్వం త్రాగునీటిని అందించడానికి నాలుగు (4) లక్షల రూపాయలు కేటాయించగా అందులో మూడు (3) లక్షల ఎనభై (80) వేల రూపాయలు ఖర్చు చేసినా ఒక చుక్క త్రాగునీరు కూడా గ్రామ ప్రజలకు ఇవ్వలేదని, పనులన్నీ పైపైనే పూర్తి చేసారని తేలింది.

ఈ విషయం స్థానిక దినపత్రికల ద్వారా తెలుసుకున్న ప్రభుత్వ విప్ అనిల్ ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి, గ్రామ ప్రజలకు త్రాగునీరు అందించడానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో పనులు తిరిగి మొదలుపెట్టిన గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగం పనులు పూర్తిచేసి అక్లూర్ గ్రామ ప్రజలకు త్రాగునీటిని అందించడం జరిగింది.

## 16. దిగివచ్చిన గ్రామపంచాయతీ — సవరించబడిన బకాయిల మొత్తం

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన చక్రాల భాస్కర్ 2012 సంవత్సరంలో ఇల్లు కట్టుకొని, ఇంటి నెంబర్ కొరకు మూడు సంవత్సరాల కాలం పాటు గ్రామపంచాయతీ చుట్టూ తిరిగాడు. కానీ ఫలితం లేకపోయింది. చివరకు 2015 లో గ్రామ పంచాయతీ ఒక నోటీసు పంపుతూ మూడు సంవత్సరాల ఇంటి పన్ను మరియు మంచినీటి వినియోగ ఛార్జీల బకాయిలు 15,718/- రూపాయలు చెల్లిస్తే గానీ ఇంటి నెంబర్ ఇవ్వమని స్పష్టం చేశారు. ఇంతటి భారీ మొత్తంలో ఇంటి పన్ను మరియు తాగునీటి వినియోగ ఛార్జీలు ఎలా విధించారన్న ప్రశ్నకు గ్రామపంచాయతీ అధికారులు సమాధానం చెప్పలేదు.

దాంతో భాస్కర్ స్థానికంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సహచట్టం రక్షణ వేదికని సంప్రదించి, వేదిక సహకారంతో సంబంధిత గ్రామ పంచాయతీ పౌర సమాచార అధికారిని సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం చేసిన దరఖాస్తు ద్వారా పెద్దమొత్తంలో ఇంటిపన్ను మరియు నీటి వినియోగ ఛార్జీలు విధించడానికి ప్రాతిపదిక మరియు అందుకు గల కారణాలను తెలపాల్సిందిగా రాతపూర్వకంగా కోరడం జరిగింది.

ఈ దరఖాస్తుకి పౌర సమాచార అధికారి స్పందించకపోవడంతో సెక్షన్ 7 ప్రకారం నిర్ణీత సమయం 30 రోజులు పూర్తయిన తర్వాత సెక్షన్ 19(1) ప్రకారం మొదటి అప్పీలేట్ అధికారి అయిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి, డిచ్‌పల్లి గారికి అప్పీలు చేసుకోవడం జరిగింది. అక్కడ కూడా నిర్ణీత 30 రోజుల సమయంలో ఎలాంటి స్పందన లేకపోవడంతో భాస్కర్ సెక్షన్ 19(3) ప్రకారం సమాచార కమిషన్‌కి రెండో అప్పీలు చేసుకోవడం జరిగింది. అప్పీలు విచారణ నిమిత్తం హాజరు కావాల్సిందిగా సమాచార కమిషన్ పౌర సమాచార అధికారికి నోటీసులు ఇవ్వడంతో గ్రామపంచాయతీ అధికారులు ఇంటి పన్ను మరియు తాగునీటి వినియోగ ఛార్జీల మొత్తాన్ని తిరిగి మదింపు చేసి భాస్కర్ చెల్లించాల్సిన పన్ను బకాయిలు 5,334/- రూపాయలుగా నిర్ధారించారు. ఈ మొత్తాన్ని చెల్లించడంతో వారం రోజుల్లోగా భాస్కర్ ఇంటికి అధికారికంగా నెంబర్ కూడా కేటాయించారు.

### 17. తప్పుడు మెడికల్ బిల్లులతో కాజేసిన ప్రజాధనాన్ని రికవరీ చేయించిన సహ చట్టం

ప్రభుత్వ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు అయ్యే వైద్య ఖర్చులను ప్రభుత్వమే చెల్లించడానికి నిర్ణయించి 1972 వ సంవత్సరంలో మెడికల్ రీయింబర్స్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా వైద్య ఖర్చుల బిల్లుల మొత్తం 50 వేల రూపాయల వరకు ఉంటే జిల్లా వైద్యాధికారులు, 50 వేల రూపాయలు దాటితే రాష్ట్ర వైద్య మరియు ఆరోగ్య సంచాలకులు ధృవీకరించాల్సి ఉంటుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ మెడికల్ రీయింబర్స్ విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లుగా ఆరోపణలు రావడంతో కుమురంభీమ్ జిల్లాలో కాగజ్‌నగర్‌కి చెందిన జాగృతి యువ మంచ్ జిల్లాలో ప్రభుత్వ మెడికల్ రీయింబర్స్ విధానం ద్వారా ప్రభుత్వం నుండి వైద్య ఖర్చులు పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయుల వివరాలు వారు సమర్పించిన బిల్లులతో సహా ఇవ్వగలరని సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం సంబంధిత పౌర సమాచార అధికారుల (మండల విద్యాధికారులు) ద్వారా రాత పూర్వకంగా కోరడం జరిగింది.

ఇలా సహచట్టం సహాయంతో పొందిన సమాచారాన్ని పరిశీలించగా కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు సమర్పించిన బిల్లులలో తేడా ఉండడంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా విద్యాధికారికి రాతపూర్వకంగా సహచట్టం ద్వారా పొందిన సమాచారం సహితంగా విజ్ఞప్తి చేయడం జరిగింది.

అయితే సంబంధిత మండల విద్యాధికారులు జిల్లా విద్యాధికారి ఇచ్చిన ఆదేశాలను పాటించకపోగా, ఇందుకు సంబంధించి సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం వచ్చిన దరఖాస్తులకు కూడా సమాచారం అందించలేదు. సహ చట్టంలోని సెక్షన్ 19(1) ప్రకారం అప్పీలుని మొదటి అప్పీలేట్ అధికారికి దాఖలు చేసినా ఫలితం లేకపోవడంతో దరఖాస్తుదారుడు సహచట్టంలోని సెక్షన్ 19(3) ప్రకారం రాష్ట్ర సమాచార కమిషన్‌కి అప్పీలు చేయడం జరిగింది.

అప్పీలు విచారణ సందర్భంగా పౌర సమాచార అధికారులు నిర్ణీత గడువులోగా సహ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం సమాచారం ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర సమాచార కమిషన్ పౌర సమాచార అధికారి మరియు మొదటి అప్పీలేట్ అధికారుల ప్రతినిధులు తెచ్చిన సమాచారం అసంపూర్తిగా ఉండడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జిల్లా విద్యాధికారి ఇచ్చిన ఆదేశాల ప్రకారం మొత్తం వైద్య బిల్లులను తనిఖీ చేసి నిర్దేశిత గడువులోగా నివేదిక సమర్పించాలని పౌర సమాచార అధికారులను ఆదేశిస్తూ గడువు విధించింది. అంతేగాక విచారణ సందర్భంగా ఈ వ్యవహారం ఆదిలాబాద్ జిల్లాకే పరిమితం కాకపోవచ్చనే ఉద్దేశ్యంతో రాష్ట్ర సమాచార కమిషన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుల వైద్య ఖర్చుల బిల్లులను మళ్ళీ తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాల్సిందిగా విద్యాశాఖ కమిషనర్‌ని ఆదేశించింది.

ఫలితంగా ఒక్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే దాదాపు 200 మందికి పైగా ప్రభుత్వ ఉపాధ్యాయుల వైద్య ఖర్చుల బిల్లులు నకిలీవిగా తేలడంతో వారి నుండి దాదాపు నాలుగు కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని అపరాధ రుసుముతో వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమచేయడం జరిగింది. ఇలా ప్రభుత్వ ధనాన్ని అక్రమ మార్గాలలో పొందడానికి ప్రయత్నించిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు శాఖాపరమైన చర్యలలో భాగంగా మూడు వార్షిక ఇంక్రిమెంట్లు దీర్ఘకాలిక ప్రభావం లేకుండా నిలిపివేయడం జరిగింది.

ఈ వ్యవహారాన్ని బయటకు తేవడమే గాకుండా విలువైన ప్రభుత్వ ధనాన్ని తిరిగి రాబట్టడంలో కీలక పాత్ర పోషించిన జాగృతి యువ మంచ్ సభ్యుడు వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ప్రవృత్తి రీత్యా సహ చట్టం కార్యకర్త అయిన మహమ్మద్ అష్రఫ్ కృషిని నాటి సమాచార కమిషనర్ శ్రీ ఇంతియాజ్ అహ్మద్ గారు ప్రత్యేకంగా అభినందించారు.

## 18. విలువైన ప్రజాధనం దుర్వినియోగం కాకుండా రికవరీ చేయించిన సహ చట్టం

పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలంలోని శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ నిధుల యొక్క ఖర్చు గూర్చి ఆ గ్రామానికి చెందిన కాసర్ల సాంబశివరావు మరియు పక్క గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మయ్య సహ చట్టం ప్రకారం దరఖాస్తు చేసి సెక్షన్ 7 ప్రకారం సంబంధిత పౌర సమాచార అధికారి నుండి పొందడం జరిగింది.

ఇలా తీసుకున్న వివరాలను పరిశీలించగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు అనుమానించి ఈ విషయమై విచారణ జరిపించగలరని పెద్దపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి గారిని లిఖితపూర్వకంగా కోరడం జరిగింది. విచారణ చేసిన డివిజనల్ పంచాయతీ అధికారి మొత్తం 5,04,209/- రూపాయల వ్యయంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ నివేదికని తగు చర్యల నిమిత్తం జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించడం జరిగింది. ఈ అభ్యంతరాలపై తగిన సమాధానం చెప్పాలంటూ జిల్లా పంచాయతీ అధికారి సంబంధిత గ్రామ సర్పంచ్‌కి షో-కాజ్ నోటీసు జారీ చేసారు.

తదుపరి చర్యలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం చేయడం జరిగింది. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఈ విషయమై నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించాలని లోకాయుక్తకి ఫిర్యాదు చేయడం జరిగింది.

లోకాయుక్త ఆదేశంతో కదలిన జిల్లా పంచాయతీ అధికార యంత్రాంగం మొదటగా సంబంధిత గ్రామ సర్పంచ్/ కార్యదర్శి నుండి 76,898/- రూపాయలు రికవరీ చేయడం జరిగింది. ఆ మేరకు సహ చట్టం దరఖాస్తుదారులకు జిల్లా పంచాయతీ కార్యాలయం నుండి సమాచారం ఇవ్వడం జరిగింది.

**19. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ సొమ్మును బ్యాంకులో పెట్టి, వడ్డీ సొమ్మును కాజేయాలనే వ్యవహారాన్ని బయటపెట్టిన సమాచార హక్కు చట్టం**

సీలింగ్‌లో ఉన్న పట్టణ భూముల క్రమబద్ధీకరణ కొరకు సంబంధిత పట్టణ భూముల సీలింగ్ యొక్క ప్రత్యేక అధికారి నిర్ణీత రుసుముతో కూడిన దరఖాస్తులు ఆహ్వానించడం జరిగింది. ఈ క్రమబద్ధీకరణ రుసుము యాభైవేల రూపాయల నుండి ఐదు లక్షల రూపాయల వరకు నిర్ణయించబడింది. దరఖాస్తుదారులు ఈ రుసుముని డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా చెల్లించాలి. ఇలా చెల్లించబడిన క్రమబద్ధీకరణ రుసుము దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయలు. ఈ సొమ్ము ఎలా వినియోగించబడుతోంది అనే విషయమై హైదరాబాద్‌కి చెందిన సుపరిపాలన వేదిక ప్రతినిధులు సహ చట్టం కింద వివరాలు కోరగా ఈ సొమ్ము ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఖజానాలో జమ చేయాల్సి ఉండగా అదేమీ లేకుండా ఒక బ్యాంకులో జమ చేస్తున్నట్లు, పైగా ఈ మొత్తంపై వస్తున్న వడ్డీ మొత్తం దాదాపు అరవై కోట్ల రూపాయలు ఈ మొత్తానికి చేర్చకుండా దారి మళ్ళించినట్లు తేలింది. దాంతో సహ చట్టం ద్వారా పొందిన సమాచారం ఆధారంగా ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించగా ప్రభుత్వం విజిలెన్స్ విభాగం చేత విచారణకు ఆదేశించింది. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. అయితే వడ్డీ మొత్తం సంబంధిత బ్యాంకు ఖాతాకి జమచేయడం జరిగింది.

**20. సహ చట్టం ద్వారా విజిలెన్స్ విభాగంలో పెండింగ్ లో ఉన్న కేసుల సంఖ్య బహిర్గతం**

ప్రభుత్వ శాఖలలో జరుగుతున్న అవినీతి ఆరోపణల విషయంలో విచారణ జరుపుచున్న విజిలెన్స్ విభాగం వద్ద మొత్తం 491 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు సహచట్టం ద్వారా హైదరాబాద్ లోని సుపరిపాలన వేదిక ప్రతినిధులు పొందిన సమాచారం స్పష్టం చేస్తోంది. ఇందులో 88 కేసులు రెవిన్యూ శాఖకి చెందినవి కాగా, 85 పౌరసరఫరాల శాఖకు, 72 పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖకు, 48 వ్యవసాయ మరియు సహకార శాఖకు, మిగతావి 30 ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించినవి. వీటి విచారణ విషయానికొస్తే వివిధ దశల్లో ఉన్నాయి.

ఉదాహరణకు వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖలో పెండింగ్‌లో ఉన్న 26 కేసులలో 14 కేసులకు సంబంధించిన విజిలెన్స్ విభాగం నుండి నివేదికలు సంబంధిత శాఖకి అందాల్సి ఉండగా, 6 కేసులలో విచారణ పెండింగ్‌లో ఉంది, మిగతా కేసులలో విచారణ అధికారుల నివేదికలు సంబంధిత శాఖాదిపతికి సమర్పించాల్సి

ఉంది. విజిలెన్స్ విచారణలో ఉన్న కేసులను పరిశీలిస్తే జీతభత్యాలు పొందడంలో జరిగిన అవకతవకలు, నూనెల కల్తీ, అక్రమంగా వ్యాపారం చేస్తున్న విషయాలకు సంబంధించిన ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. విలువైన ప్రజాధనం దుర్వినియోగం జరిగిందనే బలమైన ఆరోపణలు ఉన్న కేసుల విచారణ కూడా త్వరితంగా జరగడం లేదు అనేది సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన సమాచారం తెలియజేస్తోంది.

**21. సహ చట్టం ద్వారా ఎన్నికలలో పోటీచేసే నేరచరితులకు సంబంధించిన సమాచారం వెల్లడి**

ఎన్నికలలో నిలబడే అభ్యర్థుల విషయంలో ఎవరు నేరపూరితులు, ఎవరు కాదు అనే విషయాన్ని తెలియజేసే యంత్రాంగం ఏదీ లేదు. కాబట్టి ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో తేల్చుకోలేకపోతున్నారు. అందుకే ఎన్నికల్లో పోటీ చేయడానికి నామినేషన్ వేసిన వారి వివరాలను సేకరించి, వాటిని విశ్లేషించి ఓటర్లకు చేరవేసేందుకు హైదరాబాద్ లోని సుపరిపాలన వేదిక సహచట్టం ఉపయోగించి ఆ వివరాలు సేకరిస్తోంది. అదే సమయంలో ప్రస్తుత ప్రజాప్రతినిధులు (శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు) ప్రతి సంవత్సరం తమకు కేటాయించిన నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఎలా ఖర్చు చేసారో వాటి వివరాలు కూడా సేకరిస్తోంది, విశ్లేషిస్తోంది. తద్వారా ఓటర్లను ఈ విషయంలో చైతన్యపరుస్తోంది. ఫలితంగా ఓటరు ఎన్నికల్లో పోటీ చేసే వారిలో యోగ్యులైన వారిని ఎంచుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలను చైతన్యపరచడానికి కూడా వీలవుతోంది.

**22. ఇండ్ల నిర్మాణం పూర్తి చేయడానికి వీలుగా పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు ఇప్పించిన సహ చట్టం**

బలహీనవర్గాల వారికి పక్కా గృహాల నిర్మాణం ఉద్దేశ్యంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007 సంవత్సరంలో మొదలైన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో రాష్ట్ర విభజన నాటికి నిర్మాణంలో ఉన్న మరియు నిర్మాణం పూర్తి చేసుకున్న కొన్ని గృహాలకు బిల్లులు చెల్లించకపోవడం అనేది ఒక సమస్య. కారణం కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం స్థానంలో డబుల్ బెడ్ రూమ్ పథకం తీసుకురావడమే. అదే సమయంలో ఇందిరమ్మ గృహ నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగినట్లు తీవ్ర ఆరోపణలు రావడం కూడా జరిగింది. ఈ విషయంపై విచారణ చేపట్టిన ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్దిదారులకు బిల్లుల చెల్లింపు నిలిపివేసింది. మొత్తం 4,67,832 గృహాలు ఇంకా అసంపూర్తిగా ఉండగా వాటిపై అప్పటికే 1128 కోట్ల 31 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు, ఈ గృహాల నిర్మాణం పూర్తికావడానికి ఇంకా 2469 కోట్ల 69 లక్షల రూపాయలు కావాలని హైదరాబాద్ లోని సుపరిపాలన వేదిక ప్రతినిధులు దాఖలు చేసిన సహ చట్టం దరఖాస్తు ద్వారా ప్రభుత్వం వెల్లడించింది. ఈ లబ్దిదారులకు వెంటనే ఇవ్వాల్సిన నిధులు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వమని సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన సమాచారంతో రాష్ట్ర హైకోర్ట్‌లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేస్తే, అర్హులైన లబ్దిదారులకు రావాల్సిన మొత్తాలను చెల్లించాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఫలితంగా చాలా మంది లబ్దిదారులు తమ గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకోవడం జరిగింది.

## 23. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణపై జారీ చేసిన ఆదేశాల అమలు నిలిపివేసిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం

హైదరాబాద్ మహానగరపాలక సంస్థ పరిధిలో అక్రమ నిర్మాణాలు ఒక పెద్ద సమస్యగా మారాయి. ఈ అక్రమ నిర్మాణాలను అరికట్టలేని ప్రభుత్వాలు చివరకు వాటిని క్రమబద్ధీకరించుకోవడానికి ఆదేశాలు (పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 146 తేదీ 31.10.2015, 152 తేదీ 02.11.2015 మరియు 901 తేదీ 31.12.2007) జారీచేశాయి. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ వ్యవహారంపై మొత్తం సమాచారాన్ని పొందిన హైదరాబాద్ లోని సుపరిపాలన వేదిక ఈ ఆదేశాల అమలుని ఆపివేయాల్సిందిగా రాష్ట్ర హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకు అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకై జారీ చేసిన ఉత్తర్వుల అమలు నిలిపివేయాలని ఆదేశాలు జారీచేసింది.

## 24. అనర్హులైనవారిని సమాచార కమిషనర్లుగా నియమించడం చెల్లదు

సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 15 (5) ప్రకారం "రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, రాష్ట్ర సమాచార కమిషనర్లు ప్రజా జీవనంలో సుప్రసిద్ధులై ఉండాలి. వారికి విశాలమైన విషయ పరిజ్ఞానం, చట్టం, శాస్త్ర సాంకేతిక రంగాలు, సామాజిక సేవ, మేనేజ్‌మెంట్, జర్నలిజం, ప్రసార మాధ్యమాలు, కార్యనిర్వహణ, పరిపాలనలో అనుభవం ఉండాలి."

సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 15 (3) ప్రకారం "రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, రాష్ట్ర సమాచార కమిషనర్లను ఒక కమిటీ సిఫారసు మేరకు గవర్నర్ నియమిస్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన గల ఈ కమిటీలో ముఖ్యమంత్రితో పాటు శాసనసభలో ప్రతిపక్షనేత మరియు ముఖ్యమంత్రి చేత నామినేట్ చేయబడే ఒక రాష్ట్ర క్యాబినెట్ మంత్రి సభ్యులుగా ఉంటారు."

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల సమాచార కమిషన్‌లో సమాచార కమిషనర్ల నియామకానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన కమిటీ అందులో కొందరిని సమాచార కమిషనర్లుగా నియమించాలని గవర్నర్‌కి సిఫారసు చేయడం జరిగింది. ఈ విషయంలో గవర్నర్ పునఃపరిశీలన చేయమని కమిటీని కోరినా, కమిటీ తమ సిఫారసులో మార్పులు చేయలేదు. ఈ వివరాలను హైదరాబాద్ లోని సుపరిపాలన వేదిక ప్రతినిధులు సమాచార హక్కు చట్టం ద్వారా పొందడం జరిగింది.

సమాచార కమిషనర్ల ఎంపిక సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 15 (5) లో చెప్పబడిన విధంగా జరగలేదని, అనర్హులైన వారిని సిఫారసు చేశారని, వారి నియామకాన్ని రద్దు చేయాలని హైదరాబాద్ లోని సుపరిపాలన వేదిక సహ చట్టం ద్వారా పొందిన సమాచారం ఆధారంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేసింది. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్ట్ ఆ సమాచార కమిషనర్ల

నియామకం చెల్లదని స్పష్టం చేసింది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుని ఆశ్రయించగా మొత్తం వ్యవహారాన్ని విచారించిన దేశ సర్వోన్నత న్యాయస్థానం సమాచార కమిషనర్ల ఎంపిక నిబంధనలకు అనుగుణంగా జరగలేదని, వారి నియామకం చెల్లదని హైకోర్ట్ చెప్పిన తీర్పును సమర్థిస్తూ ప్రభుత్వ పిటిషను కొట్టివేసింది. ఈ తీర్పు దేశంలో కేంద్ర మరియు రాష్ట్రాల సమాచార కమిషనర్ల నియామకంలో ఇకపై సరైన విధంగా వ్యవహరించడానికి వీలు కల్పించింది.

### 25. రహదారిపై అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను తొలగించిన సహ చట్టం

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం వీణవంక గ్రామంలో గల ముస్లిం వాడలో గ్రామ పంచాయతీ రహదారిపై రేకుల షెడ్ నిర్మాణం చేయడం ద్వారా రాకపోకలకు అంతరాయం కలిగించుట గూర్చిన వివరాలను, అందుకు గ్రామ పంచాయతీ ఇచ్చిన అనుమతులను, అనుమతులు ఇవ్వకపోయినచో అలాంటి అక్రమ నిర్మాణాల విషయంలో గ్రామ పంచాయతీ తీసుకున్న చర్యల వివరాలు కోరుతూ ఆ గ్రామ పౌరుడు శ్రీపతి పాపన్న సహ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం లిఖితపూర్వకంగా ఇచ్చిన దరఖాస్తుకి సెక్షన్ 7 ప్రకారం సమాధానం ఇస్తూ సంబంధిత పౌర సమాచార అధికారి ఆ అక్రమ కట్టడాన్ని తొలగించినట్లు ఆ మేరకు జారీచేసిన నోటీసులు మరియు తొలగించిన విధానాన్ని తెలియజేసారు. ఈ విధంగా సహ చట్టం రహదారిపై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని తొలగించడానికి, రహదారి గ్రామ ప్రజల రాకపోకలకు ఉపయోగించుకోవడానికి ఉపకరించింది.

### 26. ప్రభుత్వ వైద్యాధికారికే ఆరోగ్య (హెల్త్) కార్డ్ మరియు పెంచిన పెన్షన్‌ని అందించిన సహ చట్టం

హైదరాబాద్ లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకురాలిగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఆచార్యులు మరియు చర్మవ్యాధి నిపుణులు అయిన డా.టి.యస్.యస్.లక్ష్మి గారు ప్రభుత్వం అందించే ఆరోగ్య (హెల్త్) కార్డు పొందడానికై తన సర్వీస్ రిజిస్టర్ యొక్క ప్రతులు మరియు తనకు రావాల్సిన పెన్షన్ పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలపై తీసుకున్న చర్యల గూర్చిన వివరాలు కావాలని పౌర సమాచార అధికారి, రాష్ట్ర వైద్య విద్య సంచాలకుల కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్  గారిని సహ చట్టం కింద దరఖాస్తు చేయడం ద్వారా 2016 మార్చి నెలలో కోరడం జరిగింది. ఈ దరఖాస్తుకి సంబంధిత పౌర సమాచార అధికారి దరఖాస్తుదారు యొక్క సర్వీస్ రిజిస్టర్ (సేవా పుస్తకం) మరియు సంబంధిత రికార్డులు లభించడం లేదని సమాధానం ఇచ్చారు. మొదటి అప్పీలేట్ అధికారిని ఆశ్రయించినా లాభం లేకపోవడంతో దరఖాస్తుదారు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌లో రెండో అప్పీలు దాఖలు చేయడం జరిగింది.

కేసుని విచారించిన కమిషన్ పౌర సమాచార అధికారి యొక్క సమాధానం తగిన విధంగా లేదని, దానిని అంగీకరించేది లేదని స్పష్టం చేస్తూ సహ చట్టం అమలులో పౌరులు అడిగిన సమాచారం అందించడానికి వీలుగా రికార్డుల నిర్వహణ విషయంలో ప్రతి అధికార యంత్రాంగానికి నిర్వహించాల్సిన చట్టబద్ధ బాధ్యతలపై కీలక వ్యాఖ్యలు చేసింది.  “సమాచార హక్కు చట్టం అనేది అధికార యంత్రాంగం పౌరులకు స్వచ్ఛందంగా సమాచారం అందించడం కొరకు ఉద్దేశించిన ప్రగతిశీల చట్టాలలో ఒకటి. అయితే ఇలా సమాచారం

అందించడం అనేది సమాచార హక్కు చట్టంలో సెక్షన్ 8 లో నిర్దేశించిన మినహాయింపులకు లోబడి ఉంటుంది. అయితే దరఖాస్తుదారు అడిగిన సమాచారం లభించలేదు అనడం, దానిని వెదకడానికి ప్రయత్నించకపోవడం అనేవి సెక్షన్ 8 లో నిర్దేశించిన మినహాయిపుల పరిధిలోకి రావు. అధికార యంత్రాంగంలో ఒక సమయంలో లభించిన లేదా అందుబాటులో ఉన్న సమాచారం, ఆ అధికార యంత్రాంగం యొక్క నియమాల ప్రకారం ధ్వంసం చేయబడిన పక్షంలో తప్ప, మిగతా సమయాల్లో పౌరులకు అందుబాటులో ఉండాల్సిందే. అడిగితే ఇవ్వాల్సిందే. అంతేకాకుండా సమాచార హక్కు చట్టం పౌరులకు సమాచారం అందించేందుకు వీలుగా ఆయా అధికార యంత్రాంగాలు రికార్డుల నిర్వహణ చేయడం చట్టబద్ధ బాధ్యత అని స్పష్టం చేస్తోంది. దరఖాస్తుదారు అదే అధికార యంత్రాంగానికి చెందిన విశ్రాంత అధికారిణి అయి వుండి, గత 17 సంవత్సరాలుగా పెన్షన్ పొందుతున్నప్పటికీ, ఆ విశ్రాంత అధికారిణికి సంబంధించిన రికార్డులు ప్రధానంగా శాశ్వత రికార్డు అయిన సర్వీస్ రిజిస్టర్ లభించడం లేదనడం, వెదకడానికి ప్రయత్నించకపోవడం మరియు విషయాన్ని ముగించడం ద్వారా సంబంధిత అధికార యంత్రాంగం బాధ్యతారహితంగా వ్యవహరించింది". ఫలితంగా పదవీవిరమణ పొందిన 17 సంవత్సరాల తర్వాత కూడా ఆ ఉద్యోగికి తన పెన్షన్‌లో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిజంగానే పెంపు చేయడం జరిగిందా? లేదా? అనే విషయం తెలియదు. సమాచార హక్కు చట్టం అమలులో అధికార యంత్రాంగం బాధ్యతారాహిత్యం మీద పైన చెప్పిన కీలక వ్యాఖ్యలు చేసిన సమాచార కమిషన్ అధికార యంత్రాంగానికి ఈ కింది ఆదేశాలు జారీచేసింది.

దరఖాస్తుదారు సంబంధిత శాఖలోనే చాలాకాలం పాటు పనిచేసి పదవీవిరమణ పొందిన వైద్యాధికారి. ప్రస్తుతం 76 సంవత్సరాల వయసులో అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నారు. అలాంటి దరఖాస్తుదారు అడిగిన సమాచారం ఇవ్వకుండా 2014 కంటే ముందునాటి రికార్డులు లభించడం లేదు అంటూ రొటీన్ సమాధానం ఇస్తూ, రెండు మార్లు సమయం కోరి, పది నెలల సమయం గడిచినా మరింత సమయం కావాలని కోరడం అనేది సమాచార హక్కు చట్టం అమలులో పౌర సమాచార అధికారి యొక్క ఉదాసీనతని మరియు నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది. ఇలాంటివి మళ్ళీ పునరావృతం కాకుడదనే ఉద్దేశ్యంతో దరఖాస్తుదారుకి సాంత్వన కలిగించడానికి సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 19 (8) (b) ప్రకారం దరఖాస్తుదారుకి 10,000/- రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి.

అదే సమయంలో అధికార యంత్రాంగం వద్ద గల రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి నెల రోజుల్లోగా దరఖాస్తుదారు అడిగిన సమాచారాన్ని ఇవ్వాలని సంబంధిత పౌర సమాచార అధికారికి ఆదేశాలు జారీచేసింది.

**(తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్- పిర్యాదు సంఖ్య 24239/CIC-(peshi-2)/2017, తేది: 06-03-2019)**

## 27. సహ కమిషన్ ఆదేశంతో కదిలిన అధికార యంత్రాంగం — పెరిగిన పెన్షన్

వేతన సవరణ కమిషన్ నివేదిక సిఫార్సుల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2015లో ప్రభుత్వోద్యోగులు మరియు పెన్షనర్ల వేతనాల సవరణపై జారీచేసిన ఆదేశాల ప్రకారం తనకు పెన్షన్ సవరణ చేయాలని శ్రీమతి ఖుర్షీద్ బేగం 2016 సంవత్సరంలో సంబంధిత సహాయ పెన్షన్ చెల్లింపు అధికారి, నాంపల్లి, హైదరాబాద్ గారిని రాతపూర్వకంగా రెండు మార్లు కోరడం జరిగింది. కానీ మూడు నెలలు గడచినా సమాధానం రాకపోవడంతో సహచట్టం కింద సంబంధిత పౌర సమాచార అధికారికి దరఖాస్తు చేస్తూ (డిసెంబర్ 2016) తాను ఇచ్చిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలు కోరడం జరిగింది. అయితే పౌర సమాచార అధికారి స్పందించకపోవడంతో మొదటి అప్పీలేట్ అధికారి అయిన సంయుక్త సంచాలకులు, పెన్షన్ చెల్లింపుల కార్యాలయం, నాంపల్లి, హైదరాబాద్ గారిని ఆశ్రయించడం జరిగింది. మొదటి అప్పీలేట్ అధికారి కూడా స్పందించక పోవడంతో రెండో అప్పీలు దాఖలు చేయడం ద్వారా తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ని మార్చి 2017 లో ఆశ్రయించడం జరిగింది.

సమాచార కమిషన్ ఆదేశాల ప్రకారం విచారణకు 2018 జనవరిలో హాజరైన సంబంధిత పౌర సమాచార అధికారి వివరణ ఇస్తూ పెన్షన్ సవరణ పనిఒత్తిడి కారణంగా దరఖాస్తుదారు యొక్క దరఖాస్తుని పరిష్కరించడంలో ఆలస్యం జరిగిందని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దరఖాస్తుదారు యొక్క పెన్షన్ సవరణకి సంబంధించిన లెక్కలు 07.04.2017 వ తేదీననే పూర్తి చేసినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల తుది ఆదేశాలు జారీకాబడక సవరించిన పెన్షన్ చెల్లించబడలేదని, ఫిబ్రవరి 2018 నుండి సవరించిన పెన్షన్‌తో పాటు బకాయిలు కూడా చెల్లిస్తామని తెలియజేయడం జరిగింది.

సహ కమిషన్ ఆదేశాలతో కదలిన అధికార యంత్రాంగం సవరించిన పెన్షన్‌తో పాటు బకాయీలు కూడా చెల్లించడం పట్ల దరఖాస్తుదారు సంతోషం వ్యక్తం చేస్తూ సహ కమిషన్‌కి కృతజ్ఞతలు తెలియజేసింది.

**(తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్- అప్పీలు సంఖ్య 10900/CIC/2017, తేది:9-1-2018)**

## 28. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం (హైకోర్ట్) ఆదేశాలను అమలు చేయించిన సహ చట్టం

మార్చి 2015 నెలలో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం (హైకోర్ట్) ఇచ్చిన ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ చట్టం 1908 లోని సెక్షన్ 22 (1) (A) ప్రకారం నియమించాల్సిన కమిటీ యొక్క నియామక వివరాలను కోరుతూ ఎన్.ఏం.మోహన్‌రావు అనే పేరు గల పౌరుడు పౌర సమాచార అధికారి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కార్యాలయం, రెవిన్యూ (స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్లు) శాఖ, తెలంగాణ ప్రభుత్వం గారికి సహ చట్టం ప్రకారం దరఖాస్తు చేయడం జరిగింది. అయితే ఆ వివరాలను పౌర సమాచార అధికారి ఇవ్వలేదు. దాంతో ఆ పౌరుడు మొదటి అప్పీలేట్ అధికారి వద్ద అప్పీలు దాఖలు చేయగా అక్కడ కూడా నిరాశే ఎదురైంది. దాంతో రాష్ట్ర

సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల అమలుపై వివరాల కొరకు రెండో అప్పీలు ద్వారా నవంబర్ 2016 లో తెలంగాణ రాష్ట్ర సహ కమిషన్‌ని ఆశ్రయించడం జరిగింది.

కమిషన్ ఆదేశాలపై విచారణకు జనవరి 2018 లో హాజరైన సంబంధిత పౌర సమాచార అధికారి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం (హైకోర్ట్) ఆదేశాల మేరకు, రిజిస్ట్రేషన్ చట్టం 1908 లోని సెక్షన్ 22 ప్రకారం జారీ చేయబడిన నోటిఫికేషన్స్/ఆదేశాల కారణంగా ప్రభావితమైన పౌరులు తమ ఫిర్యాదులను విచారించడానికి, తగిన ఆదేశాలు జారీచేయడానికి వీలుగా అదే చట్టంలోని సెక్షన్ 22 (1) (A) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వు మిసిలేనియస్ సంఖ్య 185 తేదీ 28.07.2016 జారీ చేసిందని వివరించడం జరిగింది. ఈ విధంగా రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం (హైకోర్ట్) ఇచ్చిన తీర్పుని అమలు చేయించడానికి పౌరులకు సహ చట్టం ఉపకరించింది.

**(తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్- అప్పీలు సంఖ్య 37070 /CIC/2016, తేది: 31-1-2018)**

## 29. తప్పుగా లెక్కించడం ద్వారా రికవరీ చేసిన పెన్షన్ మొత్తాన్ని తిరిగి ఇప్పించిన సహ చట్టం

కుటుంబ పెన్షనర్ అయిన శ్రీమతి అమీనా బేగంనకు ప్రభుత్వం ఇస్తున్న కుటుంబ పెన్షన్ 11 సంవత్సరాల కాలం పాటు (2005 నుండి 2016 వరకు) ఇవ్వాల్సిన దాని కన్నా ఎక్కువగా చెల్లిస్తున్నామని, ఆ ఎక్కువ మొత్తం 75,000/- రూపాయలు అని సంబంధిత సహాయ పెన్షన్ చెల్లింపు అధికారి, ఫలక్ నుమా, హైదరాబాద్ లెక్కించారు. ఆ మేరకు ఎక్కువగా చెల్లించిన మొత్తాన్ని రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. అయితే లెక్కించడంలో జరిగిన తప్పుల కారణంగా 75,000/- రూపాయల బదులు 1,50,000/- రూపాయలను రికవరీ చేయడం జరిగింది.

అయితే ఎక్కువ చెల్లించిన పెన్షన్ మొత్తాన్ని లెక్కించడంలో జరిగిన తప్పుల కారణంగా తన వద్ద నుండి రికవరీ చేయాల్సిన దానికన్నా ఎక్కువ మొత్తంలో రికవరీ చేయడం జరిగిందని, అలా ఎక్కువ మొత్తంలో రికవరీ చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని అమీనా బేగం సహాయ పెన్షన్ చెల్లింపు అధికారి, ఫలక్ నుమా, హైదరాబాద్ గారిని ఆగస్ట్ 2017 లో లిఖితపూర్వకంగా కోరడం జరిగింది. మూడు నెలలు గడచినా ఎలాంటి స్పందన లేకపోవడంతో తన దరఖాస్తుపై తీసుకున్న చర్యల వివరాలను కోరుతూ డా.ఖాజా బద్రుద్దీన్ సిద్దిఖి సహాయంతో సంబంధిత పౌర సమాచార అధికారికి సహ చట్టం కింద నవంబర్ 2017లో దరఖాస్తు చేసారు అమీనా బేగం.

నిర్ధారిత సమయంలో పౌర సమాచార అధికారి స్పందించకపోవడంతో మొదటి అప్పీలేట్ అధికారైన సంయుక్త సంచాలకులు, పెన్షన్ చెల్లింపుల కార్యాలయం, నాంపల్లి, హైదరాబాద్ వద్ద అప్పీలు దాఖలు చేసినప్పటికీ అక్కడ కూడా నిరాశే ఎదురుకావడంతో తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ముందు 2018 ఫిబ్రవరిలో రెండో అప్పీలు దాఖలు చేయడం జరిగింది.

సమాచార కమిషన్ నోటీసులు అందుకొని 2019 మార్చిలో విచారణకు హాజరైన సంబంధిత పౌర సమాచార అధికారి కమిషన్ నుండి నోటీసు రాగానే ఎక్కువగా చెల్లించిన పెన్షన్ మొత్తాన్ని మళ్ళీ తాజాగా లెక్కించి సంబంధిత కుటుంబ పెన్షన్ దారు నుండి ఎక్కువగా రికవరీ చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి ఆదేశాలు జారీ చేసామని వివరించడం జరిగింది. కమిషన్ ఆదేశాల ప్రకారం ఆ వివరాలను సంబంధిత దరఖాస్తుదారుకి అందించడం జరిగింది. ఇలా కమిషన్ ఆదేశాల ప్రకారం ఎక్కువగా రికవరీ చేసిన మొత్తాలను తిరిగి చెల్లిస్తామని అధికార యంత్రాంగం చెప్పడంతో సంతృప్తి చెందిన దరఖాస్తుదారు అమీనా బేగం దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తన సమస్యని పరిష్కరించినందుకు సమాచార్ కమిషన్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.

**(తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్- అప్పీలు సంఖ్య 3305 & 3306/CIC/2018, తేది: 19-3-2019)**

## 30. సహ చట్టం సహకారంతో జాతీయ మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 అమలుకై చర్యలు

మానసిక దివ్యాంగులకు గల హక్కుల పరిరక్షణకై, వారికి న్యాయంగా అందించాల్సిన సేవలను అందించడానికి, వారి ఆరోగ్య రక్షణకై, ఆరోగ్యం మెరుగుపడడానికి తీసుకోవాల్సిన చర్యలను సకాలంలో తీసుకోవడానికి వీలుగా భారత పార్లమెంట్ మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 ఆమోదించడం జరిగింది. ఈ చట్టం ప్రకారం మానసిక దివ్యాంగుల ఆరోగ్య సంరక్షణకై ఏర్పాటు చేయబడే మానసిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాల విషయంలో కనీస ప్రమాణాలను నిర్దేశించడం జరిగింది. మానసిక దివ్యాంగులని చేర్చుకోవడం, ఆశ్రయమివ్వడం, వారిని, వారి ఆరోగ్యాన్ని సంరక్షించడం, వారికి చికిత్స అందించడం, పునరావాసం కల్పించడం మొదలగు విషయాలకై ఏర్పాటు చేయబడే మానసిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు/సంస్థలు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 కింద నియమించిన అథారిటీ వద్ద విధిగా రిజిస్టర్ అయి ఉండాలి. రిజిస్ట్రేషన్ చేసుకునే సంస్థలు మరియు కేంద్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాల్సిన కనీస ప్రమాణాలను కూడా మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 నిర్దేశించింది.

సామాజిక చేతన మరియు బాధ్యత కలిగిన ఇద్దరు పౌరులు ఆర్.రాజేంద్ర ప్రసాద్ మరియు కె.ఆనంద్ రెండు తెలుగు రాష్ట్రాల్లో (తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్) అనధికారికంగా నిర్వహించబడుతున్న మానసిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాల యొక్క దుశ్చర్యలపై మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 ప్రకారం తీసుకున్న చర్యలు వివరాలు కావాలని సహ చట్టం ద్వారా సంబంధిత పౌర సమాచార అధికారిని కోరడం జరిగింది. ఫలితంగా సామాజిక కార్యకర్తలతో ఒక తనిఖీ కమిటీని నియమించిన సంబంధిత అధికార యంత్రాంగం ఈ ఇద్దరు పౌరులను కూడా ఆ కమిటీలో సభ్యులుగా నియమించడం జరిగింది.

ఈ తనిఖీ కమిటీ ఇచ్చిన నివేదికలో చేసిన సూచనలు, సలహాలపై తీసుకున్న చర్యల వివరాలు కోరుతూ కె.ఆనంద్ పౌర సమాచార అధికారి, సంచాలకుల కార్యాలయం, వైద్య విద్య, హైదరాబాద్ గారికి

సహ చట్టం ప్రకారం జూలై 2016 లో దరఖాస్తు ఇవ్వడం జరిగింది. చట్టం నిర్దేశించిన సమయంలో కోరిన వివరాలు ఇవ్వకపోవడంతో మొదటి అప్పీలేట్ అధికారిని ఆశ్రయించినా అక్కడ కూడా నిరాశే ఎదురుకావడంతో, వివరాలు అందించాలని ఆదేశాలు జారీచేయమని కోరుతూ తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ని సెప్టెంబర్ 2016 లో ఆశ్రయించడం జరిగింది.

సమాచార కమిషన్ విచారణకు హాజరైన సంబంధిత పౌర సమాచార అధికారి మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 అమలుకు భారత ప్రభుత్వం తొమ్మిది నెలల సమయం ఇచ్చిందని, ఈ సమయంలో ఈ చట్టం అమలుకై తగిన చర్యలు తీసుకోవడానికై జారీ చేయాల్సిన ఆదేశాల రూపకల్పనకై వరుసగా సమావేశాలు, కార్యశాలలు (వర్క్ షాప్స్) నిర్వహించడం జరిగిందని,వీటి సారాంశాన్ని క్రోడీకరించి మానసిక ఆరోగ్య సంస్థ రూపొందించిన రాష్ట్ర మానసిక ఆరోగ్య సంరక్షణ అథారిటీ ఏర్పాటు మరియు రాష్ట్ర మానసిక ఆరోగ్య సంరక్షణ నియమాలు ముసాయిదాలని 03.01.2019 రోజున ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందని, ప్రభుత్వం నుండి ఆదేశాలు రాగానే వాటి అమలుకై సత్వరమే చర్యలు తీసుకొంటామని నివేదించడం జరిగింది. పౌర సమాచార అధికారి వివరణతో సంతృప్తి చెందిన కమిషన్ అథారిటీ ఏర్పాటు మరియు నియమాల జారీకి వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

మరోవైపు ఆర్.రాజేంద్ర ప్రసాద్ తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించబడుతున్న అనధికార మానసిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాల వివరాలను కోరుతూ పౌర సమాచార అధికారి, సంచాలకుల కార్యాలయం, వైద్య విద్య, హైదరాబాద్ గారికి సహ చట్టం ప్రకారం జూలై 2016లో దరఖాస్తు ఇవ్వడం జరిగింది. చట్టం నిర్దేశించిన సమయంలో కోరిన వివరాలు ఇవ్వకపోవడంతో మొదటి అప్పీలేట్ అధికారిని ఆశ్రయించినా అక్కడ కూడా నిరాశే ఎదురుకావడంతో, వివరాలు అందించాలని ఆదేశాలు జారీచేయమని కోరుతూ తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ని సెప్టెంబర్ 2016 లో ఆశ్రయించడం జరిగింది. సమాచార కమిషన్ విచారణకు హాజరైన దరఖాస్తుదారు తొమ్మిది అనధికార మానసిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు నిర్వహించబడుతున్నాయని అందులో 93 మంది మానసిక దివ్యాంగులకు మానసిక వైద్యుడు లేకుండానే చికిత్స అందిస్తున్నారని, సంచాలకులు, వైద్య విద్య, హైదరాబాద్ చేత 23.11.2015 తేదీన నిర్వహించబడిన తనిఖీ తర్వాత కొద్ది నెలల్లోనే 26 సంవత్సరాల యువకుడు మరణించాడని కమిషన్ దృష్టికి, సంచాలకులు, వైద్య విద్య, హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తేవడం జరిగింది.

సమాచార కమిషన్ నిర్వహించిన విచారణకు హాజరైన మానసిక ఆరోగ్య సంస్థ పర్యవేక్షణాధికారి దరఖాస్తుదారు ఇచ్చిన అనధికార ఆరోగ్య కేంద్రాల జాబితాపై నిజానిజాల నిర్ధారణకు ఒక వైద్యాధికారుల బృందాన్ని నియమించడం జరిగిందని, వారు చేసిన తనిఖీలో ఆరోగ్య కేంద్రాల జాబితా కొన్ని పేర్లు పునరావృతం అయ్యాయని, మరికొన్నింటి చిరునామాలు సరిగ్గా లేవని తెలియజేశారు.

సంచాలకులు, వైద్య విద్య, హైదరాబాద్ ఆదేశాలపై నిర్వహించబడిన తనిఖీ అనంతరం అనధికారికంగా నిర్వహించబడుతున్న ఆరోగ్య కేంద్రాలను నిపుణులైన వైద్యాధికారులు తనిఖీ చేసి అర్హులైన కేంద్రాలకు లైసెన్స్‌లు

జారీ చేసామని, ఆ వివరాలు కూడా దరఖాస్తుదారుకి ఇవ్వడం జరిగిందని వివరించారు. ఆరోగ్య కేంద్రాలకు లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందని, డాక్టర్లకు కాదని వివరించిన పౌర సమాచార అధికారి, లైసెన్స్ పొందిన ఆరోగ్య కేంద్రాలను నియమితకాలంలో తనిఖీ చేయడానికి వైద్యాధికారుల బృందాలను నియమించామని, అయితే తనిఖీలు నియమిత కాలానుసారం జరగడం లేదని అంగీకరించారు.

లైసెన్సులు పొందిన మానసిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను నియమిత కాలానుసారం తనిఖీలు చేయకపోతే మానసిక ఆరోగ్య సంరక్షణకై ప్రభుత్వాలు తెచ్చిన చట్టాలు, నియమాలు, చేసిన ఏర్పాట్లు నిష్ప్రయోజనంగా మారుతాయని అభిప్రాయపడిన సమాచార కమిషన్ మానసిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను నియమిత కాలానుసారం తప్పక తనిఖీ చేయాలని/చేయించాలని సంచాలకులు, వైద్య విద్య, తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ గారిని ఆదేశించింది. అదే సమయంలో సహ చట్టం దరఖాస్తుదారుని యొక్క తపన మరియు చర్యలను ప్రత్యేకంగా ప్రశంసించింది.

**(తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్- అప్పీలు సంఖ్య 29664 /CIC/2016, తేది: 30-11-2017 మరియు అప్పీలు సంఖ్య 31547/CIC-(peshi-2)/2016 తేది:04-01-2019)**

- - - - - - - -oOo- - - - - - - -

డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ ప్రభుత్వం

రోడ్ నం.25, జూబిలీ హిల్స్, హైదరాబాద్-500 033

ఫోన్ నం. +91 40 2354 8487, www.mcrhrdi.gov.in

డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ ప్రభుత్వం

రోడ్ నం.25, జూబిలీ హిల్స్, హైదరాబాద్-500 033

ఫోన్ నం. +91 40 2354 8487, www.mcrhrdi.gov.in